సూర్య
చిత్తూరు జిల్లా | తిరుపతి జిల్లా
శుక్రవారం | 29 డిసెంబర్ 2023 | పేజీలు 8

ఐరాల నుంచి మొరంపల్లి వరకు

# తారు రోడ్డు నిర్మించండి!

- రోడ్డు ఎక్కిన మొరంపల్లి గ్రామస్థులు
- శాశ్వత రోడ్డు నిర్మాణం కోసం 50 ఏళ్లుగా నిరక్షణ
- ఎన్నిప్రభుత్వా లు మారిన మాతలరాతులు మారలేదు.మొరంపల్లి గ్రామపంచాయతీ ప్రజలు



**ఐరాల, మేజర్ న్యూస్:** మొరంపల్లె గ్రామ పంచాయతీ నుండి మండల కేంద్రమైన ఐరాల వరకు తారు రోడ్డును ప్రభుత్వం నిర్మించాలని చిత్తూరు జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు సురేంద్ర బాబు డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ మొరంపల్లి గ్రామ కమిటీ, మండల కమిటీ ఆధ్వర్యంలో మొరుంపల్లె దారిలోని మఠం వద్ద గ్రామ పెద్దలు గ్రామస్థులతో కలిసి మొరంపల్లి బుధవారం ఉదయం నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా భహుజన సమాజ్ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రబాబు పాల్గొన్నారు. సందర్భంగా పి సురేంద్రబాబు మిగతా 2 లో

తెలుగు వారి జీవితాల్లో నవశకం రావాలి...

## తెలుగు జాతి నెంబర్ 1 కావాలి





దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

తెలుగు వారు ఎక్కడున్నా ఎన్నికల సమయం లో రాష్ట్రం కోసం అడుగు వేయాలి

బెంగళూరు టీడీపీ ఫోరం సమావేశంలో అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపు



**కుప్పం,మేజర్ న్యూస్:** నవశకం తెలుగువారి సొంతం కావాలని, నంబర్ వన్ గా తెలుగుజాతి ఉండాలనేదే తన విజన్ అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో థింక్ గ్లోబల్లీ....యాక్ట్ లోకల్లీ ఉండేదని..కానీ ఇప్పుడు థింక్ గ్లోబల్లీ..యాక్ట్ గ్లోబల్లీ అనేది తన కొత్త నినాదమని పేర్కొన్నారు. సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల పర్యటన కు వెళ్లేందుకు బెంగుళూరు ఎయిర్ పోర్ట్ కు వచ్చిన చంద్రబాబు....ఇక్కడ జరిగిన బెంగుళూరు టీడీపీ ఫోరం మీటింగ్ లో పాల్గొన్నారు. ఎయిర్ పోర్టు వద్ద చంద్రబాబుకు పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కెవిఎమ్ కన్వెన్షన్ హాలుకు చేరుకున్న చంద్రబాబు పార్టీ బెంగళూరు ఫోరం సభ్యులు నిర్వహించిన మిగతా 2 లో

**తెలుగుజాతి రుణం తీర్చుకుంటా:**

**బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు నేటి నుండి వందరోజుల ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. మీ భవిష్యత్తుతో పాటు ఏపీ భవిష్యత్తు ను తీర్చిదిద్దే బాధ్యతను కూడా మీరు తీసుకోవాలి. షార్ట్ టర్మ్ యాక్షన్ ప్లాన్ ద్వారా ఏం చేయగలుగుతారో ముందే ఆలోచించుకోండి. మీ గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్యపరచాలి. విద్యార్థి నాయకుడిగా ఉండి కూడా నేను మొదటిసారి ఎమ్మెల్యే అయింది యువత వల్లనే. మీరు పబ్లిక్ పాలసీ ద్వారా ఎలా బాగుపడ్డారో మీ గ్రామాల్లోని ప్రజలకు చెప్పాలి.**

## ఈవీఎం గోడౌన్ వద్ద కట్టు దిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి



– కలెక్టర్ ఎస్. షన్మోహన్

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత పకడ్బందీ గా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఎస్. షన్మోహన్ మాట్లాడు తూ ఎన్నికల ఈవీఎం గోడౌన్ వద్ద పకడ్బందీ గా భద్రత నిర్వహించాలని తెలిపారు. 24 గంటలు సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాల న్నారు. గోడౌన్ లోని ఈవీఎం లను పరిశీలించారు. డిఆర్ఓ రాజశేఖర్, ఎన్నికల విభాగం సూపరిండెంట్ బ్యూలా , సిబ్బంది ఉమాపతి, మనోజ్ లు పాల్గొన్నారు.

## వీరు డ్రాపౌట్స్ కాదా?

- బాలకార్మికులను నిర్మూలించరా?

- ప్రవీణ్ ప్రకాష్ ఐ.ఎ.యస్ డ్రాపౌట్స్ లేరన్నారు



**చౌడేపల్లి(మేజర్ న్యూస్) :** గతం లో ప్రాథమిక విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ .ఐ.ఏ.యస్ ఏమన్నారో గుర్తుందా? ఒక్క డ్రాపౌట్స్ కనిపిస్తే ఉద్యోగానికి రాజినామా చేస్తామన్నారు.ఐతే ఇప్పుడు చేయండంటూ న్యాయ సేవా ప్రజా పరిరక్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఉత్తరాది హరిప్రసాద్ డిమాండ్. **వివరాలు ఇలా ఉన్నాయి :** చౌడేపల్లి మండలం లోని చారాల గ్రామపంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుచున్న అరుణ్,చైతన్య అను ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్ళకుండ డ్రాపౌట్స్ గా ఉంటూ నేడు బాలకార్మికులు గా మారి కూలిపనులు చేసుకుంటున్నారు. ఐతే గతం లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఏమన్నారో గుర్తుచేసుకుంటూ ఒక డ్రాపౌట్స్ ఉంటే రాజినామా చేస్తానన్నారు కదా ఐతే ఇప్పుడు రాజినామా చేయమనూ అన్నారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బాలకార్మిక వ్యవస్థ పూర్తిగా నిర్మూలించాలని విద్యార్థులకు మిగతా 2 లో

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



**వరదయ్యపాలెం, మేజర్ న్యూస్:** సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఎం, ఎమ్మెల్యేతో సత్యవేడు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించగా,అంతా మంచే జరుగుతుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడించినట్టు తెలిపారు.అనంతరం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని కలిసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

# ఉద్యోగులతో తనకు వీడని అనుబంధం

▸ వారి సంక్షేమం కోసం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు ▸ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టం



ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ చేస్తున్న టిటిడి చైర్మన్ భువన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి



పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన టిటిడి ఉద్యోగస్తులు

**తిరుపతి కార్పొరేషన్, మేజర్ న్యూస్:** టీటీడీ ఉద్యోగులతో విడదీయరాని అనుబంధం వారి సంక్షేమం కోసం, ధార్మిక ప్రచారం కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైన వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. టిటిడి ఉద్యోగుల కార్యక్రమం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం గురువారం మహతి కళాక్షేత్రంలో ఒక పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడి చైర్మెన్ భూమన మాట్లాడుతూ వేలాదిమంది ఉద్యోగులకు తన చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగించిందనీ, తన జీవితంలో ఇది మహదానందం ఆయన చెప్పారు. 17 సంవత్సరాల క్రితం తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిని కలిసి ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయమై చర్చించినట్లు చెప్పారు. తన ఒత్తిడి వల్లే ఉద్యోగులకు ఇంటిస్థలాలు మంజూరు చేసినట్టు 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఇదే వేదిక మీద తెలియజేశారని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తన ద్వారా సాధించే రోజు రావాలనే కోరిక దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ఈ కలలో సహకారం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అయితే చట్ట ప్రకారం ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ కూడా ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. టిటిడి ఉద్యోగుల కళా సహకారంలో ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం కార్యనిర్వాహకవర్గం తనకు చేదోడు వాదోడుగా ఉండి ముందుకు నడిపించారని కొనియాడారు. పాగాలి వద్ద 350 ఎకరాల భూమి టీటీడీకి ఇవ్వడంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి కృషి అభినందనీయమన్నారు. ఇందుకోసం బుధవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో 87 కోట్ల రూపాయలు మంజూరు చేయించడంలో ఈవో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఉద్యోగులతో తమకున్న బంధాన్ని విడదీయలేరని కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. పేరు కోసం కాకుండా బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించారన్నారు. తాను రాజకీయాల్లో ఉండడం వల్లే ఎమ్మెల్యేగా, చైర్మన్ గా అయ్యానని, ఈ పదవులు రావడం వల్లే పేదల కోసం, ఉద్యోగుల కోసం తాను నిస్వార్థంగా పనిచేయగలుగుతున్నానని చెప్పారు. గతంలో పాలక ప్రభుత్వాలు ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన నెరవేర్చలేదని, అంతే ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో సాధన సుసాధ్యమైందన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వల్లే టీటీడీలో పారిశుద్ధ్య కార్మికులకు రూ.5000, పోటు కార్మికులకు పది వేల రూపాయల మిగతా 2 లో

### ఐరాల నుంచి మొరంపల్లి వరకు

# తారు రోడ్డు నిర్మించండి!

మాట్లాడుతూ మొరుంపల్లె గ్రామ పంచాయతీ నుండి ఐరాల మండల కేంద్రానికి తరతరాలుగా మట్టి రోడ్డు ఉందని అన్నారు. ఈమట్టి రోడ్డు ను సిమెంటు రోడ్డు కానీ తారు రోడ్డు కానీ నిర్మించాలని గత 50 సంవత్సరాలుగా సంబంధిత ప్రభుత్వ అధికార్లు కు వినతి పత్రాలు సమర్పించిన ఫలితం లేదన్నారు. మొరుంపల్లె పంచాయతీ ప్రజలు సుమారు గత 50 సంవత్సరాలుగా వర్షం వస్తేచాలు అడుచు గుంతలు గామారుతుంది. ఈమట్టిరోడ్డుపై నడవాలంటే ఎక్కడ జారిపడి నడుము ఇరుగు తుందేమో ని భయపడి నడవాల్సి వస్తోంది. అన్నారు. 50 సంవత్సరాలుగా సంవత్సరాలుగా అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో బుధవారం ఉదయం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష కు పూనుకున్నామని అధికారులు స్పందించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ ఐరాల మండల అధ్యక్షులు ఐకుట్టి వెంకట స్వామి మాట్లాడుతూ మొరంపల్లి గ్రామ పంచాతీ నుంచి ఐరాల వరకు ఉన్న మట్టిరోడ్డు గ్రామ పంచాతీ ప్రజలు నడవాలంటే అనేక ఇభందులుపడుతున్నారని ఇప్పటికైనా సంభందించిన అధికార్లు స్పందించి రోడ్డు నిర్మించి సమస్య పరిష్కారం చేయాలని అన్నారు. లేదంటే సమస్య పరిష్కారం అయ్యేవరకు బహుజన సమాజ్ పార్టీ ఉద్యమిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బిఎస్పీ, జిల్లా సీనియర్ నాయకులు ఐ, విశ్వనాథం, జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కోళ్ళపల్లి వినోద్ కుమార్, మొరుంపల్లె గ్రామ పెద్దలు భాస్కరయ్య,నాగయ్య,వీరభద్రయ్య,బాలు, లోక, చిరంజీవి, తులసి, సారధి, యశ్వంత్, గోపి, శివ, పెద్దబ్బ, రఘు, జగదీశ్, మహిధర్, జ్యోతి, జాన్ వెస్లీ, జయన్న, మధు, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులతో తనకు వీడని అనుబంధం

జీతం పెంచగలిగామని చెప్పారు. అంతేకాకుండా వాహనం బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్ గా గుర్తించి వారికి కూడా జీతాలు పెంచగలిగే ఏర్పాటు చేయగలిగామన్నారు. టీటీడీ ఈవో ఏ.వి ధర్మారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు మంజూరు చేసేలా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ పాలనలో టిటిడి ఉద్యోగుల ఇంటి స్థలాలు కోసం 210 కోట్లు మంజూరు చారిత్రాత్మకంన్నారు. పాగాలి వద్ద 350 ఎకరాలు త్వరలోనే స్వాధీనం చేసుకుని జనవరి చివరి నాటికి టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ ఇంటి స్థలం ఇప్పించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. హెచ్.బి.ఎల్ వారికి కూడా ఇంటి స్థలాలు ఇస్తామని, రెండో విడతగా మరో 15 రోజుల్లో ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమం మహతి ఆడిటోరియంలోనే నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం కోసం టీటీడీ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే 800 అప్పీళ్లను కొత్త బోర్డు వచ్చాక పరిష్కరించామని, భవిష్యత్తులో డిఎ కేసులు లేకుండా ఉండేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. అనంతరం సీనియర్ అధికారుల సంఘం తరపున టీటీడీ పీఆర్వో డా.తలారి రవి, పలువురు ఉద్యోగులు ప్రసంగించారు. ఆ తరువాత టీటీడీ ఛైర్మన్, ఈవో చేతుల మీదుగా ఉద్యోగులకు ఇంటి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### తెలుగు వారి జీవితాల్లో నవశకం రావాలి...

# తెలుగు జాతి నెంబర్ 1 కావాలి

సమావేశంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..."పార్టీలో మేము అన్నిరంగాల వింగ్ లు ఏర్పాటు చేశాంకానీ...మీరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బెంగళూరు ఫోరం ఏర్పాటు చేసినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. మీలో యువశక్తి కనబడుతోంది..భవిష్యత్ మీదే. నాకు కష్టం వచ్చినప్పుడు ఏ విధంగా మీరు అండగా నిలబడ్డారో ఇప్పుడు మీ ఉత్సాహం చూస్తే కనిపిస్తోంది. నేను చేసిన మంచి పనులు వల్ల నాకు మద్ధతుగా 70 దేశాల్లో ఉన్న తెలుగువారు గుర్తు పెట్టుకుని ముందుకొచ్చి మద్ధతు తెలిపారు. అందుకు మనస్ఫూర్తిగా ధన్యావాదాలు, అభినందలు చెప్తున్నా. తెలుగు వారంటే గతంలో ఏపీకి మాత్రమే పరిమితం. కానీ నేడు తెలుగువారు ఏపీ, తెలంగాణలోనే కాకుండా చెన్నై, బెంగళూరు ఇలా ఏ సిటీకి వెళ్లినా మన వాళ్ల ప్రతిభ కనిపిస్తుంది. ఇది ఎంతో గర్వ కారణం.

ప్రతి ముగ్గురు ఐటీ ప్రొఫెషనల్స్ లో ఒక తెలుగువాడు:

మన దేశంలోనే కాదు..ప్రపంచం మొత్తంలో తెలుగు వారు విస్తరిస్తున్నారు. ఏ దేశానికి వెళ్లినా ప్రముఖ స్థానాల్లో మన తెలుగు వారు ఉండటం సంతోషంగా ఉంది. నేను సీఎం అయిన తొలిరోజుల్లో తెలుగు వాళ్లు అప్పటిదాకా ఎక్కువగా వ్యవసాయం చేస్తూ, వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. రైతు బిడ్డ ఐటీ ప్రొఫెషనల్ ఎందుకు కాకూడు, ఒక కూలీ చేసుకునే వ్యక్తి వారి కొడుకుని ఐటీ ప్రొఫెషనల్ ఎందుకు చేయకూడదు అని ఆలోచించాను. అందుకే నాలెడ్జ్ ఎకానమీకి శ్రీకారం చుట్టా. అదే ఐటీ. ఎడ్ల బండ్ల నుండి డ్రైవర్ లెస్ కార్ల దాకా టెక్నాలజీ వచ్చింది. అభివృద్ధిలో చాలా ముందకు వెళ్తున్నాం. నాడు నేను ఐటీనీ ప్రారంభించినప్పడు ఎగతాళి చేశారు. గతంలో ఐటీ అంటే బెంగళూరు మాత్రమే ఉండేది..కానీ బెంగళూరుతో పోటీపడి హైదరాబాద్ ఉండాలని, నాలెడ్జ్ ఎకానమీతో హైదరాబాద్ ను ప్రపంచం పటంలోనే పెట్టాం. ముగ్గురిలో ఐటీ ప్రొఫెషనల్ లో మన తెలుగువారు ఒకరున్నారు. నాలెడ్జ్ ఎకానమీలో ప్రపంచంలోనే ముందకు వెళ్తున్నాం. ఫార్మారంగం, బయో టెక్నాలజీతో పాటు ఏ సెక్టార్ తీసుకున్నా నాలెడ్జ్ ఎకానమీ కి ఎప్పుడూ ఐటీ బ్యాక్ బోన్ గా తయారైంది. ఉద్యోగాలు చేయడం కాదు..మీరు ఉద్యోగాలు మీరివ్వాలనేదే నా ఆకాంక్ష. ప్రపంచంలో ఏ దేశానికెళ్లినా మన వాళ్లు ఉద్యోగాలు చేస్తూ పెట్టుబడులు పెట్టి స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో అగ్రస్థానంలోనే తెలుగు జాతి ఉండాలి. లోకేషన్ అనేది ఈ రోజుల్లో సమస్య కాదు..ఎక్కడున్నా నాలెడ్జ్ ఉంటే ప్రపంచం మొత్తం సేవలందించే నెట్ వర్క్ అందించే శక్తి తెలుగువారికి ఉంది. దేశానికి మంచి ఆస్తిగా టెక్నాలజీని అందించాలనేది నా ఆశ. సంస్కరణల వల్ల దేశానికి సంపద సృష్టించే అవకాశం వచ్చింది.

2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామిగా మనదేశం:

2047 నాటికి ప్రపంచానికే నాయకత్వం ఇచ్చేది మన భారతదేశమే. నేను విజన్ 2020 అంటే ఆనాడు ఎగతాలి చేశారు..నన్ను 420 అని కూడా విమర్శించారు. ఆ 2020 విజన్ తో అసోషియేట్ అయిన వాళ్లు నేడు బ్రహ్మాండంగా ముందకు వచ్చారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం అగ్రదేశంగా, అభివృద్ధి చెందిన దేశంగా నెంబర్ వన్ స్థాయిలో ఉంటుంది. దేశంతో పాటు మన రాష్ట్రాన్ని కూడా మనం కాపాడుకోవాలి..దాని బాధ్యత తెలుగు వాళ్లు ఎక్కడున్నా వారిపై ఉంది. రాష్ట్రం కోసం నేను పోరాడతా..కానీ దానికి మీ సహకారం కావాలి. దేశానికి పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు వచ్చాక దశదిశ మారింది. ఐటీని ప్రొమోట్ చేయాలని పబ్లిక్ పాలసీ తీసుకొచ్చాం. రోడ్లు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి వాటిపై పబ్లిక్ పాలసీ ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలి. 21వ శతాబ్దం నాలెడ్జ్ ఎకానమీకి నాంది. 2047 నాటికి మనదేశం అగ్రగామిగా మారుతుందంటే అది దేశానికి దక్కే అరుదైన గౌరవం. బెంగళూరు టీడీపీ ఫోరం ప్రారంభించారు..మంచి పరిణామం. గతంలో ఆడపిల్లలను తల్లిదండ్రులు చదివించడానికి శ్రద్ధ చూపించేవారు కాదు..ఎంతోకొంత చదివించి పెళ్లి చేసి పంపించేవారు. అందుకే నాడు ఆలోచించా... ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు పెట్టి ప్రోత్సహించాం. ఆడపిల్లలు ఎంత మంచిగా చదువుకుంటే సమాజానికి అంత మంచిందని ఆలోచించాను.

మీరే ఉద్యోగాలిచ్చే స్థాయికి వెళ్లాలి:

ఏ కులమైనా, ఏ మతమైనా మన దేశంలో ఉన్న కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. ఇంటికి వస్తే కష్టాలు మరిచి కుటుంబాన్ని చూసి మళ్లీ యాక్టివేట్ అయ్యే సంస్కృతి మన దేశంలో మాత్రమే ఉంది. ఇప్పుడు ఏపీలో అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టాయి. పబ్లిక్ %--% ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానం ఉండాలని సంకల్పించాను. ఫ్లైఓర్లు, రోడ్లు, ఎయిర్ పోర్టులు వచ్చింది కూడా పీపీపీ మోడల్ లోనే. ఈ విధానం వల్ల సంపద బాగా పెరిగింది. ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరికం లేని సమాజాన్ని చూడాలనేది నా జీవిత ఆశయం. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్ షిప్ పాలసీ ద్వారా సంపద సృష్టించే విధానం రావాలి. ఆ వ్యవస్థకు నేను శ్రీకారం చుట్టాలనుకుంటున్నా. మీరే కాదు..మీతో సమానంగా మీ పక్క కుటుంబం పైకి రావాలి. మీ శక్తికి తగ్గట్టుగా కుటుంబాలను పైకి తీసుకొస్తే మన జన్మ సార్ధకం అవుతుంది. ప్రజలను, జనాభాను ఆస్తిగా భావించి ప్రణాళిక సిద్ధం చేస్తే వారి నుండి పేదరికాన్ని తరిమేయవచ్చు. నేను సాదారణ కుటుంబంలో పుట్టాను. నేను చదువుకునే రోజుల్లో మా ఊరికి రోడ్డు లేదు..విద్యుత్ లేదు. అప్పటి కంటే ఇప్పటి పరిస్థితులు బెటర్.

## వీరు డ్రాపౌట్స్ కాదా?

తగిన సౌకర్యాలు అందించాలని నాడు-నేడు ద్వారా ఉచితంగా ఇస్తుంటే ఇలా బాలకార్మికులు తయారవుతుంటే సచివాలయ సిబ్బంది ఏమి చేస్తున్నారని ఆయన అన్నారు. కావున వెంటనే సంబందిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

## మందుబాబులఅడ్డా గా ఫారెస్ట్ చెక్ పోస్ట్



**చౌడేపల్లి(మేజర్ న్యూస్) :** మండలం లో అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఉండాలని మండలం లో శెట్టిపేట లో అటవీ శాఖ ఆద్వర్యం లో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఐతే కొద్దిరోజుల తర్వాత చెక్ పోస్టు మూతబడింది. అప్పటి నుండి నిరుపయోగంగా ఉంది. అలా నిరుపయోగంగా ఉండటం వలన కర్ణాటక సారా ప్యాకెట్లు అమ్మేవారికి అడ్డాగా మారిందని ,గతం లో ఈ చెక్ పోస్టు తెరచివుంచినప్పుడు ఎటువంటి అసాంఘిక చర్యలు జరిగేవి కావని అది మూతపడినప్పటి నుండి మందుబాబుల అడ్డాగా మారింది. గతం లో ఇక్కడ మధుర మలై అడువుల నుండి ఎటువంటి కలప అక్రమ రవాణా జరిగేది కాదు. మదుర మలై అడవుల నుండి వృక్షసంపద రాత్రికి రాత్రే తరలిపోతుంది. కావున సంబందిత అధికారులు వెంటనే చెక్ పోస్టు ను పునరుద్దరించాలని ప్రజలు కోరుచున్నారు.

## తిరుమలలో వైభవంగా ప్రణయ కలహ మహోత్సవం



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం ప్రణయ కలహ మహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరో రోజు, అధ్యయనోత్సవంలో 17వ రోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు పల్లకీ ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరొక పల్లకీపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జియ్యంగార్లు పూలచెండ్లతో స్వామివారిని మూడుసార్లు తాడించారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు. అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూరహారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్య ప్రబంధంలోని పాసురాలను నిందా – స్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆట అదుర్స్..

**- యువతలో ఉత్సాహం నింపుతున్న.. ‘ఆడుదాం ఆంధ్ర ‘**
**- 3వ రోజు చెలరేగి ఆడిన క్రీడాకారులు**
**- నియోజకవర్గంలో పర్యటించిన తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**
**- తుమ్మలగుంటలో తిరుపతి జిల్లా జేసీ శుభం బన్సల్ పర్యవేక్షణ**

**చంద్రగిరి, మేజర్ న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు చేపట్టిన ‘ఆడుదాం ఆంధ్ర ‘ ఉత్సాహభరితంగా సాగుతోంది. గురువారం 3వ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో ఆయా పంచాయతీల్లో టోర్నీలు హోరా హోరీగా సాగాయి. తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడలను నియోజకవర్గ పరిధిలో పర్యటించి పర్యవేక్షించారు. తనకిష్టమైన క్రికెట్ ను ఆడి యువతను ఉత్సాహ పరిచారు. క్రీడల నిర్వహణ, క్రీడాకారుల అనుభవాలను ఆరా తీస్తూ మోహిత్ రెడ్డి ముందుకు సాగారు. క్రీడాకారులకు కిట్లు అందజేశారు.

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలను తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి జిల్లా జేసీ శుభం బన్సల్ పర్యవేక్షించారు. ఇరువురు క్రికెట్ ఆడి సందడి చేశారు. ముందుగా జేసీ బౌలింగ్ చేయగా తుడా ఛైర్మెన్ బ్యాటింగ్ చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని జేసీ యువతకు సూచించారు. క్రీడాకారులు చెలరేగి ఆడారు. దుర్గసముద్రం పంచాయతీలో కూడా సందడి నెలకొంది. తుడా ఛైర్మెన్ పర్యవేక్షించారు. క్రీడాకారులు పోటాపోటీగా ఆడారు.

పాకాలలో..

పాకాల మండలంలో ఊట్లవారిపల్లి, గానుగపెంట పంచాయతీలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం సందడిగా సాగింది. ఆయా క్రీడల్లో యువ జట్లు దుమ్ములేపాయి. పండుగ వాతావరణంలో క్రీడాకారులు ఖో ఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ లలో సత్తా చాటారు. క్రికెట్ ఆడిన తుడా ఛైర్మెన్ యువతను ఉత్సాహ పరిచారు. క్రీడల్లో పాల్గొని శారీరక దృఢత్వం పెంపొందించుకోవాలని మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు.





# కుప్పం నారాయణ పాఠశాలలో ఘనంగా స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్



**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పం పట్టణం, గుడిపల్లి రోడ్డు లో ఉన్న నారాయణ పాఠశాలలో ఇ- కిడ్స్ విద్యార్థులు అత్యంత అద్భుతంగా స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా నారాయణ పాఠశాల డీజీఎం కొండలరావు, ఏజీఎం అవధానం ఫణి కుమార్ , ఆర్ ఐ ప్రసాద్, ప్రిన్సిపాల్ విజయ్, కాలేజ్ ఏజీఎం బాలకృష్ణ లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విజేతులైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ నరేష్, ఏడి ప్రదిప్, హై స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మన్, ఇ- చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ గుణసుందరి, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ కార్తిక మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడల్లో సత్తా చాటిన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు




**కుప్పం, మేజర్‌న్యూస్:**
కుప్పం డిగ్రీ కళాశాలలో బి.కం (సి.ఏ) రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సి. జగపతి ఇటీవల తిరుపతిలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ చెస్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనాడు. జనవరి 26 నుండి భారతిదాసన్ యూనివర్సిటి, తిరుచినాపల్లిలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటి చెస్ ఛాంపియన్లో పాల్గొననున్నాడు. విద్యతో పాటు క్రీడల్లో రాగిస్తున్న జగపతి ప్రతిభను కళాశాల చైర్పర్సన్ శాంతానాగరాజ్, వైస్ చేర్మెన్ సాగర్ రాజ్ కొనియాడారు. ఈ సంధర్భంగా ఖగపతిను, అతనికి తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సుదాకర్ను కళాశాల ప్రిన్సిపాల్ డి. సుదారాణి అభినందించారు.

# చంద్రబాబు లేఖ పై స్పందించిన రైల్వే అధికారులు

**కుప్పం, మేజర్ న్యూస్:**
తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ కు రైల్వే అధికారులు స్పందించారు.నర్సాపూర్ - బెంగళూరు స్పెషల్ ఎక్స్ ప్రెస్ రైలు ను కుప్పంలో ఆపేందుకు అధికారుల అంగీకారం చేశారు. చంద్రబాబు చొరవతో ఇప్పటికే రోజుకి 18 రైళ్లు ఆగుతున్న కుప్పం స్టేషన్ లో ఇకపై 19 వ రైలు కూడా అగనుంది. విజయవాడ వెళ్ళే వారికి ఈ ట్రైన్ వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

# వైభవంగా గురుదక్షిణమూర్తి అభిషేకం

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:**
శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో గురువారం సందర్భంగా శ్రీ మేధా గురు దక్షిణామూర్తి స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు దేవస్థాన అధికారులు దేవస్థానం ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం ఎప్పటికైన తెలుగోడి ఆత్మగౌరవమే...

- బాబు మూడు రోజుల నియోజకవర్గం పర్యటన ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రికి సొంత నియోజకవర్గంలో ఘన స్వాగతం పలికిన తెలుగు తమ్ముళ్లు...
- భారీ ఫ్లెక్సీలతో పశుపుమయమైన కుప్పం నియోజకవర్గం...
- అధికారం లోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత తీసుకుంటా... బాబు...



**గుడిపల్లి, మేజర్ న్యూస్:** నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం నాడు గుడిపల్లి మండలానికి చేరుకున్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ కేసులో జైలు నుండి వచ్చిన తర్వాత తన సొంత నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటన చేస్తున్నడం తమ ఆరాధ్య దైవం, తమ ప్రియతమ నాయకుడును కనులారా చూడటానికి నియోజకవర్గంలోని ప్రజలు ,తెలుగు తమ్ముళ్లు అభిమానులు భారీ ఎత్తున గుడిపల్లి మండలానికి చేరుకొని ఆయనకు గజమాలతో, హారతులతో ఘన స్వాగతాన్ని పలికారు. చంద్రబాబు రాకతో ప్రతి గ్రామము భారీ ఫ్లెక్సీలతో ,తెలుగుదేశం పార్టీ జెండాలతో పసుపుమయమైనది. చిన్న పెద్ద తేడా లేకుండా ఎటు చూసినా చంద్రబాబు నాయుడు పేరుతో నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. బెంగళూరు నుండి రోడ్డు మార్గం ద్వారా గుడిపల్లి మండలంలోని బిసనాత్తం గ్రామనికి చేరుకుని అక్కడి నుండి ఆయన పర్యటన ప్రారంభించారు. పర్యటనలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు , స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాను ఎంతగానో రుణపడి ఉన్నానని, ఈ సైకో పాలనలో తన సైకోతనంతో ప్రజల్ని ఇబ్బంది పెడుతూ క్షణికానందాన్ని పొందుతూ తనను ఏ విధంగానైనా ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతో తనపై లేని కేసులను బనాయించి నన్ను జైలులో కూర్చోబెట్టారని కానీ చివరకు న్యాయం ఎప్పుడు గెలుస్తుందని మరోసారి తన విషయంలో రుజువైందని ఆయన తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడు తన నియోజకవర్గ ప్రజలు తన సొంత కుట్టుంబా మనిషి అనుకొని తన కోసం ఎన్నో పూజలు, ఉద్యమాలు చేశారని అలాంటి ప్రజలకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని ఆయన అన్నారు. కుప్పంలో తనను ఓడిస్తానని కుప్పానికి చంద్రబాబు నాయుడు ఏమి చేయలేదని చెప్పుకుంటూ ప్రచారాలు చేస్తున్న ప్రతి నాయకుడు కూడా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో ఓనమాలు నేర్చుకుని ఇప్పుడు తనపై విమర్శలు చేస్తుండడం అందుకు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆనంద పడడం హాస్యాస్పదంగా ఉందని, జగన్మోహన్ రెడ్డి తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తనను కుప్పం ప్రజల నుండి వేరు చేయలేకపోయాడని అంతటి అనుభవమున్న రాజకీయ నాయకుడి వల్లనే తన ప్రజల నుండి తనపై ఉన్న అభిమానాన్ని చరపలేకపోయాడని ఇప్పుడొచ్చి కుప్పంలో చంద్రబాబు నాయుడు ని ఓడిస్తాం, కుప్పానికి చంద్రబాబు నాయుడు ఏమి అభివృద్ధి చేశాడని మాట్లాడడం వారి అజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనమని ఆయన అధికార పార్టీ నాయకులపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఏఎంసి చైర్మన్ చంద్రశేఖర్, మాజి జెడ్పిటిసి బేటప్ప నాయుడు, మండల మాజీ ఎంపీపీ మునిరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సుబ్బు, కార్యదర్శి భానుమూర్తి, తెలుగుదేశం పార్టీ సర్పంచులు, మాజీ సర్పంచులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిరస్మరణీయంగా.. చెవిరెడ్డి పాలన

**- గడప గడపలో మోహిత్ రెడ్డికి పెరుగతున్న ఆదరణ - అన్నయ్యను గెలిపించాలంటూ హర్షిత్ రెడ్డి వేడుకోలు**



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గ చరిత్రలో ఎమ్మెల్యే చెవిరెడ్డి పాలన చిరస్మరణీయంగా నిలుస్తుందని.. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. అనునిత్యం ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన క్రుషిని ఎన్నటికీ మరువలేమని పల్లెజనం బహిరంగంగా చెబుతున్నారు. కరోనా వంటి కష్టం వచ్చినా.. వరదలు వంటి విపత్తు వచ్చినా.. ఎవ్వరికి ఏ ఆపద వచ్చినా సరే నేనున్నాను అంటూ అండగా నిలిచే ఆయన తెగువ.. పండుగలు వచ్చినా పర్వదినాలు వచ్చినా తన కుటుంబ సభ్యులకంటే ఎక్కవగా ప్రజలకు ఏదో ఒకరకంగా సాయం చేస్తూ ప్రతి ఇంటికీ ఓ పెద్ద దిక్కుగా నిలిచే మంచి మనస్సు పట్ల పల్లె ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డి చేసిన మేలుకు రుణం తీర్చుకోవాలంటే ఆయన బిడ్డను ఎమ్మెల్యేగా చేయడం ఒక్కటే మార్గమన్న ఆలోచనకు వచ్చినట్లు బహిరంగంగా చెబుతున్నారు. చంద్రగిరి మండలం కొటాల పంచాయతీ అనంతగుర్రప్పగారిపల్లి, పాండురంగయ్యగారి పల్లి, కొటాల గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల జాబితాను లబ్ధిదారులకు అందించిన తర్వాత వచ్చే ఎన్నికల్లో తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తమకు ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకుంటూ పలువురు మహిళలు, పెద్దలు తప్పకుండా ఆయన బిడ్డను గెలిపిస్తామని మాట ఇచ్చారు.

**అంతటా.. అపూర్వ స్వాగతం...**

గడపగడపకు వెళ్లిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి ప్రతి ఇంటా అపూర్వ స్వాగతం లభించింది. రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి బిడ్డ తమ ఇంటి వద్దకు రాగానే కర్పూర హరతులతో సాదర స్వాగతం పలికారు. పలుచోట్ల గ్రామస్తులు శివార్లకు చేరుకుని పూల వర్షం కురిపిస్తూ గ్రామంలోకి తీసుకువచ్చారు. గ్రామ దేవతలకు పూజలు చేసిన తర్వాత ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లిన హర్షిత్ రెడ్డి జగనన్న సంక్షేమం, చెవిరెడ్డి చేసిన మేలును ప్రతి ఒక్కరికీ గుర్తు చేశారు.

# జిజేఎం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఘన స్వాగతం

**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు గురువారం కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు నగరానికి పలు కార్యక్రమాలలో పాల్గొనడానికి విచ్చేశారు. ఇందులో భాగంగా జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గురజాల జగన్ మోహన్ చంద్రబాబు నాయుడుకు హెచ్ ఏ ఎల్ ఎయిర్పోర్ట్ నందు ఘన స్వాగతం పలికారు. అనంతరం కుప్పం నియోజకవర్గం కు చెందిన తెలుగుదేశం నాయకులు త్రిలోక్ ను పరామర్శించడానికి వెళ్లిన నారా చంద్రబాబు నాయుడుకు అన్ని ఏర్పాట్లు చేశారు. హొస్కోటే సమీపంలోని కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ బెంగుళూరు ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమరశంఖారావం కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ చిత్తూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు గురజాల జగన్ మోహన్ ఏర్పాట్లు చేశారు.





# భారీ వర్షాలకు శ్రీకాళహస్తి మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు

**-సొంత నిధులతో రెండు జెసిబిలు ద్వారా రోడ్డు మరమ్మతులు**
**- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి**



**శ్రీకాళహస్తి రూరల్ మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లంపల్లి, వాగవేడు,మేళ్లచురు కుంటిపుడి, బివిపూరం, కొత్తూరు, గొల్లపల్లి గ్రామస్తులు ధ్వంసమైన రహదారుల పరిస్థితిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి తన సొంత నిధులు వెచ్చించి రెండు జెసిబి యంత్రాలు, పది ట్రాక్టర్లను పంపించి మరమత్తులు చేయించారు.దీంతో ఆ మార్గాలు గుండా వెళ్లే గ్రామస్తులు వాహన చోదకులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

# మోకాళ్లపై మున్సిపల్ కార్మికులు నిరసన



**కుప్పం, మేజర్ న్యూస్:** కుప్పం మున్సిపల్ లో కార్మికులు అందురు కలిసి మునిసిపల్ కార్యాలయం ఆవరణంలో రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మూడో రోజు కుప్పంలో సైతం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26000/-లు అమలు చేయాలనీ,మునిసిపల్ కాంట్రాక్ట్, ఔటసోర్సింగ్ కార్మికులందర్ని పర్మినెంట్ చేయాలనీ. ..సుప్రీంకోర్ట్ తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు కుప్పం ప్రజలు కూడా సహకరించవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమానికి మూడో రోజు సమ్మెను ప్రారంభించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మరియు సీఐటీయూ మండల్ కార్యదర్శి సి పార్థిబన్, మునిసిపల్ అధ్యక్షులు కే గోవిందరాజులు, ఉప అధ్యక్షులు పి భారత్, మంజుల, వెంకటేష్ మరియు మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# 17వ రోజు సమ్మెలో ఉత్తరాల ఉద్యమం

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** తమ సమస్యల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఉధృతంగా మారుతుంది.సమస్యలపై అంగన్వాడి నాయకులతో ప్రభుత్వం రెండుసార్లు జరిపిన చర్చలు విఫలం కావడంతో అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది.ఇందులో భాగంగానే అంగన్వాడీల సమ్మె గురువారంతో 17వ రోజుకు చేరుకుంది.ఈ నేపథ్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు వినూత్నంగా ఆందోళన నిర్వహించారు.తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలంటూ అంగన్వాడి కార్యకర్తలు మూకుమ్మడిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా ఉత్తరాలు రాశారు.ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు.గత 17 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడి సమస్యలపై ప్రభుత్వం,సమస్యకు పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు.తెలంగాణ కన్నా అధికంగా వేతనాలు చెల్లిస్తామంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన గుర్తు చేశారు.మినీ అంగన్వాడి కేంద్రాలను,మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్చాలన్నారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు.సర్వీసులో ఉండి చనిపోయిన కార్యకర్త కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు.పెండింగ్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల అద్దె,2017 టిఏ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.ఇప్పటికైనా అంగన్వాడి సమస్యలను సానుకూలంగా పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అంగనవాడి కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆగేది లేదన్నారు.తదనంతరం సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడి కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తల నాయకులు నిర్మల, శాంతి, ఇందిర, ఝాన్సీ, భారతి, కాంతమ్మ, సుభాషిని, దివ్య, గౌరీ, మంజుల, అనూష, అనిల భువన, రజిని, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడా సాధన తోనే మంచి ఆరోగ్యం




**పెనుమూరు, మేజర్‌న్యూస్:** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా కార్యక్రమములో యువత, విద్యార్థులు క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచాలని కలికిరి పంచాయతీ కార్యదర్శి లావణ్య అన్నారు. గురువారం కలికిరి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలోని పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గ్రామస్తులైన మహిళా సంఘ సభ్యులు, విద్యార్థులు కబడ్డీ, కోకో క్రీడలను ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎంపీటీసీలు మాట్లాడుతూ క్రీడా సాధన తోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని, యుక్త వయసులోనే ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపి మంచి ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాలన్నారు. పొందాలన్నారు ఈ కార్యక్రమాలను పాఠశాల ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వైకాపా పార్టీ బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కడియాల మహేష్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కృషి చేయండి

**- ఎస్వీయూలో ఘనంగా గిరిజన నవ సమాజ ద్వితీయ వార్షికోత్సవం**



**తిరుపతి, మేజర్‌న్యూస్ :**

గిరిజనుల అభివృద్ధి కోసం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లోని సెనేట్ హాల్ లో గురువారం గిరిజన నవ సమాజ ద్వితీయ వార్షికోత్సవం ఆ సంఘం వ్యవస్థాపకులు పాలిత్య శివ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాలిత్య శివశంకర్ నాయక్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని విద్య వైద్యం ఉపాధి అనే నినాదంతో విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం గిరిజన నవ సమాజ ఫెడరేషన్ పనిచేస్తుందని చెప్పారు. రాజ్యాంగపరంగా చట్టపరంగా పేద గిరిజనులకు రావాల్సిన హక్కులు సాధనకై గిరిజన నవ సమాజ నిరంతరం పనిచేస్తుందని జాతి ప్రజల కోసం రాజీలేని పోరాటం చేయడమే తమ లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మా గిరిజనుల బతుకులు మాత్రం ఎలాంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం రాజకీయ పార్టీలు పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. టీటీడీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడైన అతి రాం బాబాజీ ఆధీనంలో ఉన్న భూములను పేద బంజారా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోబి శివా నాయక్ శ్రీ హాథీరామ్ జీ మటన్ బంజారా నేషనల్ కన్వీనర్, అశోక్ కుమార్ నాయక్ బంజారా నాయకులు అనిత ఫేమ్ సింగర్ నాగరాజు గారు మిమిక్రీ ఆర్టిస్ట్ విజయ్ కుమార్ గారూ చంద్రశేఖర్ నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత నాయక్ రాష్ట్ర నాయకులు సునీల్ కుమార్ నాయక్ విద్యార్థి విభాగం నాయకులు బాలు నాయక్ సంతోష్ నాయక్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** కాంగ్రెస్ 139 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం తిరుపతిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కిదాంబి ప్రమీలమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగరవేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి కపట ప్రేమ నటిస్తూ ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ముక్తకంఠంతో తెలియజేశారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ నన్నే కాన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి దూది రమేష్, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సెల్ కోఆర్డినేటర్ బయల గోపి, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రేమ్ సాగర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రొసీడింగ్స్ పై సీఎం బొమ్మ అవసరమా..?

**- నిబంధనలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు : బిఆర్ఎస్ అర్కాట్ కృష్ణప్రసాద్**



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** టిటిడి ఉద్యోగులకు ఇచ్చిన ఇంటిస్థలాలు ప్రొసీడింగ్స్ పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటోను అవసరమా అని, హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా వైసీపీ ప్రభుత్వం నిబంధనలకు తూట్లు పొడిచిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అర్కాట్ కృష్ణప్రసాద్ మండిపడ్డారు. ఉద్యోగస్తుల ప్రొసీడింగ్స్ పై సీఎం బొమ్మ వేయడానికి తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ ధార్మిక సంస్థకు సంబంధించిన వాటిపైన ఆ దేవదేవుడి కలియుగదైవం శ్రీవారి ఫోటోను దేవస్థానం వాడుకోవాలి, కానీ ఈ నిబంధనలు ఉల్లంఘిస్తు ప్రొసీడింగ్స్ పై సీఎం బొమ్మ వేయడం నిబంధనలు ఉల్లంఘించినట్లే అన్నారు. ఈ నిబంధనలు వైసీపీ ప్రభుత్వం కాలరాస్తూ ఉత్తర్వులు పై ముఖ్యమంత్రి ఫోటో పెట్టడం అవివేకం అని తక్షణమే ఆ లోగోను తీసివేసి యాధ్రప్రకారం ఉంచాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రం లో సమస్యలను గాలికి వదిలేసి కేవలం పబ్లిసిటీ పై ఆసక్తి చూపిస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని తిరుమల తిరుపతి దేవస్థానం సంబంధించిన ఉత్తర్వులలో ఇటువంటి తప్పులు జరగకుండా కఠినమైన నిర్ణయాలను అధికారులు తీసుకోవాలని సూచించారు.

## కౌటిల్యలో ఆల్ ఇండియా క్యాట్ టాపర్లకు అభినందన




**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** స్థానిక ముత్యాలరెడ్డిపల్లి వద్ద వున్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్ లో జాతీయ స్థాయి పరీక్ష ' క్యాట్ '(కామన్ అడ్మిషన్ టెస్ట్) రిజల్ట్స్ లో ఆల్ ఇండియా టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించామని కౌటిల్య ఇన్ స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 21న విడుదలైన ఫలితాలలో కౌటిల్య ఇన్ స్టిట్యూట్ కు చెందిన దాదాపు 10 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారన్నారు. వీరిలో సియాద్రి చక్రధర్ (ఐ.ఐ.టి.-తిరుపతి)కి ఆంధ్రప్రదేశ్ లో టాప్ స్కోర్-98.93 శాతం, వీరితో పాటు ఎమ్.గౌరీ శంకర్ రెడ్డి (ఎస్.వి.అగ్రికల్చర్ కాలేజీ)కు 93.46 స్కోర్, కె.రిషివర్ధన్ (ఆర్.సి.రెడ్డి డిగ్రీ కాలేజీ) - 90.65 , కె.సాయి కిరణ్ రెడ్డి - 84.87 (గాయత్రీ డిగ్రీ కాలేజీ), సి.భవ్య శ్రీ నిషిత-84 .50 (ఎస్.వి.సి.ఈ కాలేజీ), అగిరాల హేమచంద్ర - 82.29 (అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజీ), సుమ లహరి (ఎస్.వి.అగ్రికల్చర్ కాలేజీ)- 80.25 , బి.జెనిస్ (పద్మావతి మహిళా యూనివర్సిటీ)- ఎన్.మ్యాట్ ఎగ్జామ్ లో 220 స్కోర్స్ సాధించారన్నారు. గత 15 సంవత్సరాలుగా క్యాట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకి, కౌటిల్యలో ఐఐఎంలు, బిజినెస్ స్కూల్స్ నిర్వహించే ఇంటర్వ్యూ, రాత పరీక్షలు, గ్రూప్ డిస్కషన్స్ కోసం ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. దీని ద్వారా క్యాట్ లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఐఐఎం లు నిర్వహించే తదుపరి సెలక్షన్ టెస్ట్ లలో సులభంగా విజయం సాధించి ఎంబిఏ అడ్మిషన్స్ సాధిస్తున్నారన్నారు.

## రోడ్డు పనులను వేగవంతం చేయండి : కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** నగర అభివృద్ధిలో భాగంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో టిటిడి పరిపాలనా భవనం ఆనుకుని ఉన్న రోడ్డు నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కమిషనర్ మట్లాడుతూ భవాని నగర్‌లోని టీటీడీ పరిపాలనా భవనం ప్రహరి గోడను ఆనుకొని భవానీనగర్ గుండా రైల్వే కాలనీ వైపుగా 500 మీటర్ల పొడవుతో వెలుతున్న కాలువను నూతనంగా నిర్మిస్తున్నామన్నారు. అనంతరం దానిపై స్లాబ్ వేసి రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తి అయితే చుట్టు ప్రక్కల చాలా ప్రాంతాలకు సౌకర్యవంతమైన రహదారిగా ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే కాలువను పటిష్ఠంగా నిర్మించి, దానిపై స్లాబ్ ను వేయడంతో బాటు సిసి రోడ్డును నిర్మించే పనులు కూడా తుది దశకు చేరుకుంటున్నట్టు తెలిపారు. లైటింగ్ వేసేందుకు దిమ్మెలు కూడా నిర్మించడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులపై నిరంతర పర్యవేక్షిస్తూ పండుగలోపు అన్ని పనులు పూర్తి చేసి రోడ్డు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, కాంట్రాక్టర్ సహన్ వున్నారు.

## ఈయూ ఎస్.ఏ.ఐతో మహిళ వర్సిటీ ఒప్పందం




**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** శ్రీపద్మావతి మహిళ విశ్వ విద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఈ.యూ. ఎస్.ఏ.ఐ హైదరాబాద్ సంస్థతో పలు అంశాలపై అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం మహిళా వర్సిటీ వి.సి ప్రొఫెసర్ డి.భారతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సారా సరోజినీ సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజనీ, ఈ.యూ.ఎస్.ఏ.ఐ సంస్థ ప్రతినిధి ఎస్.శివ కుమార్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం విశ్వవిద్యాలయ క్రీడల ప్రచారం, క్రీడలకు వేదికను కల్పించడం, యూనివర్సిటీ గేమ్స్, స్పోర్ట్స్ ఈవెంట్స్ ప్రత్యక్ష ప్రసారం, ప్రీమియర్ ఈవెంట్‌లో క్రీడాకారుల ప్రయాణ అవసరాల కోసం ఒప్పందం చేసుకున్నట్లు తెలియజేశారు.

## స్థల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

### అధికారులకు వెంకట స్వామి నాయుడు విజ్ఞప్తి



**తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్**

తమ ఉమ్మడి కుటుంబం స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితులు వెంకటస్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థల బాధితుడు వెంకటస్వామి నాయుడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీడియాకు వివరాలను వెల్లడించారు. తమ ఉమ్మడి కుటుంబంలో అన్నదమ్ములు కే.దామోదర్ నాయుడు, పి.శంకర నాయుడు, పి.రాజేంద్ర నాయుడు, కె.ఆనందమ్మ 1986లో తిరుమల నాగమ్మ నుంచి మంగళం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్లు 108/9, 108/10లో గల ఎకరా మూడు సెంట్లు భూమిని కొనుగోలు చేశామన్నారు. కొందరు రాజకీయ అండదండలతో తమ ఉమ్మడి ఆస్తిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని మీడియా ముందు వాపోయారు. అప్పటినుంచి తమ అనుభవంలో ఉన్న సదరు భూమిపై పులిచెర్ల మాజీ జడ్పిటిసి అశోక్, అతని బావమరిది అశోక్ లు కన్నేసి దౌర్జన్యంగా స్థలంలోకి ప్రవేశించే నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సదరు స్థలంకు సంబంధించి రోడ్డు భూ సేకరణలో భాగంగా 34 సెంట్లు స్థలాన్ని కోల్పోయామని, ఇందుకు పరిహారం కూడా అందిందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ కు, జిల్లా ఎస్పీకి స్పందన ద్వారా అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కబ్జా చేయడానికి స్థలంలోకి కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం మాకు సంబంధించిన ఈ భూమిలో ప్రహరీ గోడల నిర్మాణం చేయడానికి సన్నాహాలు చేస్తుంటే కబ్జాదారులు అడ్డు తగులుతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూ బాధితులు నుండి తమకు రక్షణ కల్పిస్తూ తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థల భాగస్వామ్యులు దామోదర్ నాయుడు, అనందమ్మ కుమారుడు అశోక్ పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదాతలు అవ్వండి



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:**
రక్తదానంతో ప్రాణదాతలు అవ్వాలని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ కళాశాలలో రక్తదానం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర రెడ్డి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ రక్త దానం చేయడం ద్వారా సమాజ సేవతో పాటు ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చున్నారు. సినియర్ ప్రొఫెసర్ డా. రమణ మాట్లాడుతూ రక్త దానం ప్రాణ దానంతో సమానం అన్నారు. మెడికల్ ఆఫీసర్ డా.సంతోష్ రక్త దానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆవశ్యకతను వివరించారు. రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డా.విక్రమ్ ఆరోగ్యవంతులైన 18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరు ప్రతి 3 - 4 నెలలకు ఒక్కసారి రక్త దానం చేయవచ్చున్నారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది వాలంటీర్లు సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. రక్త దాతలకు రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ ధ్రువ పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డా.రెడ్డి శేఖర్, డా.సరళ, డా.సంతోష్, డా.లీలావతి, డా. వాణి, డా.గణేష్ కుమార్, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఏడుకొండలను జగన్ కొండలగా మార్చాలని అనుకొంట్టున్నారా....?

# టిటిడి ప్రొసీడింగ్స్ పై జగన్ బొమ్మ దేనికి..? బిజెపి

**తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్**

టిటిడి ఉద్యోగులకు అందిస్తున్న ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ పై ఒకవైపున టిటిడి సింబల్ తో కూడిన శ్రీవారి బొమ్మ, మరోవైపున జగన్ బొమ్మను పెట్టి ప్రొసీడింగ్స్ ఇవ్వడం అభ్యంతరకరమని రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి జి భాను ప్రకాష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఇళ్ల పట్టాల ప్రొసీడింగ్స్ పై జగన్ బొమ్మ ముద్రించడంతో బీజేపీ నాయకులు గురువారం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు ఇచ్చే ఇళ్ల స్థలాల ప్రొసీడింగ్స్ లోను రాజకీయ పార్టీ నేతల బొమ్మలను ప్రచురించడం తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో ఇదే మొదటిసారి అని వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వ ప్రచార ఖండూతికి



ఇది పరాకాష్టగా మారిందని రాష్ట్ర బిజెపి కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం అభివర్ణించారు. ఇప్పటివరకు సైన్ బోర్డులు, వైఎస్ఆర్ కిట్లు, జగనన్న విద్యా దీవెన, జగనన్న పథకాలకు తన ఫోటోను తగిలించి సంబరపడిపోతున్న ముఖ్యమంత్రి ఆఖరుకు తిరుమల వెంకటేశ్వర స్వామితో సమానంగా తన ఫోటోను ముద్రించి ఇవ్వడం హిందు భక్తుల మనోభావాలతో చెలగాట మాడటమేనని అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ అన్నారు. తక్షణం ప్రొసీడింగ్స్ పై ఫోటోలను తీసి వేయాలని టిటిడి యాజమాన్యానికి బిజెపి అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్ సూచించారు. నిరసన చేస్తున్న బిజెపి నాయకులను పోలీసు అధికారులు అక్రమంగా అరెస్టు చేసి అలిపిరి పోలీస్ స్టేషన్లో ఉంచి వ్యక్తిగత పూచీ మీద విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో జి భాను ప్రకాష్ రెడ్డి, ముని సుబ్రహ్మణ్యం, సామంచి శ్రీనివాస్, పొనగంటి భాస్కర్, టిడి వరప్రసాద్, జల్లి మధుసూదన్, పసల సురేష్, కొండేటి ప్రేమ్ కుమార్, నాధముని రెడ్డి, జీవన్ రాయల్, మండల నాయకులు శరత్ కుమార్, మురళి, పగడాల ప్రభాకర్ కార్యకర్తలు ఉన్నారు.

## సుందరీకరణ పనులు పరిశీలించిన కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** నగర పరిధిలోని జరుగుతున్న సుందరీకరణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలోని పద్మావతీ కళ్యాణమండపం సమీపంలోని నారాయణపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన మత్స్యకారుడి విగ్రహం ఏర్పాటు పనులను పరిశీలించారు. విగ్రహం చుట్టూ గ్రీనరి పెంచి వాటర్ పౌంటైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. గతంలో అక్కడ నుండి తొలగించిన పూర్ణ కుంభం, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, తెలుగుతల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని కూడళ్లలో కూడా గ్రీనరి, రంగురంగుల పూలతో మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. కరకంబాడి మార్గంలో నగరపాలక సంస్థ పరిధిలోకి వచ్చే వారికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు నమస్కారం విగ్రహాన్ని పరిశీలించారు. ఈ పనులన్నీ రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట డి.ఈ.మహేష్ ఉన్నారు.

## ఉత్సాహంగా వాలీబాల్ టోర్నమెంట్



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం ప్రతిసాత్మకంగా నిర్వహిస్తున్న ఆడదాం ఆంధ్ర టోర్నమెంట్లో ఉత్సాహంగా వాలీబాల్ టోర్నమెంటు క్రీడాకారులు నిర్వహిస్తున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత స్పష్టం చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో లీలామహాల్, కరకంబాడీ రోడ్డులోని మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని మహిళలు, పురుషుల క్రీడాకారులకు నగరంలో ఎంపిక చేసిన 29 మైదానాల్లో వాలీబాల్ పోటీలు నిరసిస్తున్నామన్నారు. జీవకోన ప్రాంతాల్లోని 8 సచివాలయాల పరిధిలో నమోదు చేసుకున్న క్రీడాకారులకు లీలామహాల్, కరకంబాడీ రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన మైదానంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలను కమిషన్ పరిశీస్తూ ప్రజలు ఉత్సహంగా పాల్గొంట్టున్నారని తెలిపారు. వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు కమిషనర్ హరిత అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ సూపర్డెంట్, క్రీడల కో ఆర్డినేటర్ పి.రవి, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

## పిడిఆర్ బాండ్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేయండి



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:**
కార్పొరేషన్ ద్వారా నగర పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం జారీ చేసిన ట్రాన్సఫరబల్ డెవెలప్‌మెంట్ రైట్స్ వివరాలు పూర్తి స్థాయిలో సిద్దం చేసి అంది ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో కమిషనర్ హరిత ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గిఫ్ట్ డిడ్ వివరాలను ఒక క్రమపద్దతిలో ప్రభుత్వం జారీ చేసిన ఎస్.ఓ.పి పద్దతిన సిద్దం చేయాలన్నారు. ఇప్పటికే టిడిఆర్ స్క్రూటిని కమిటి సమావేశంలో వీటిపై చర్చించడం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో జరగబోవు స్క్రూట్ని కమిటి సమావేశానికి టిడిఆర్, గిఫ్ట్ డిడ్ ల పూర్తి వివరాలతో సిద్దంగా వుండాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## సిద్ధా వైద్యంకు ప్రత్యేక స్థానం

### : డాక్టర్.ఆర్.వి.కుమార్



**తిరుపతి కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** దక్షిణ భారతదేశ తోపాటు తమిళనాడులో సిద్ధ వైద్యానికి ప్రత్యేకమైన స్థానం ఉందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్.బి కుమార్ తెలియజేశారు. స్విమ్స్ అనుబంధంగా ఉన్న భారత ఆయుష్ మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ పథకం క్రింద సిద్ధ క్లినిక్ రీసెర్చ్ యూనిట్ తిరుపతి వారి ఆధ్వర్యంలో 7వ సిద్ధా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం స్విమ్స్ లో జరిగిన కార్యక్రమానికి ఆర్గనైజింగ్ కమిటి సభ్యులు స్విమ్స్ ఉపకులపతి డా.ఆర్. వి.కుమార్, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ డాక్టర్ మీనా, సిద్ధా తిరుపతి యూనిట్ ఇంచార్జి డాక్టర్. సామ్రాజ్, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఉషాకళావత్, కార్డియాలజి ప్రొ డా. వనజాక్షమ్మ కమ్యూనిటీ మెడిసిన్ డా. నాగరాజు జ్యోతిని ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తమిళనాడులో సిద్ధ వైద్యంకు ప్రత్యేకమైన స్థానం ఉందని తెలిపారు. ఈ సిద్ధ వైద్య విధానాన్ని సాక్ష్యాత్తు ఆ ఆదియోగి అగస్త్య ముని దీనిని దక్షిణాధికి తీసుకవచ్చారని, ఆయన సిద్ధ వైద్యన్ని ఆచరించారని చెబుతారు. సిద్ధ వైద్యంలో ఔషదాలు ఒక అద్భుత రీతిలో ఉపయోగం పడుతాయన్నారు. సిద్ధ వైద్య విధానంలో ఋషులు, ఆత్మజ్ఞానం పొందినవారు. సిద్ధ వైద్యులు వేరు వేరు కాదని పేర్కొన్నారు. సిద్ధ ఇన్చార్జ్ డా సామ్రాజ్ మాట్లాడుతూ స్విమ్స్ కు అనుబంధంగా జనవరి 16, 2019 నుండి అమూల్యమైన సేవలను సిద్ధ అందిస్తోందన్నారు. 5వ సంవత్సరం పూర్తి చేసుకున్నందుకు. మా లక్ష్యాలను సాధించడంలో మాకు సహాయం చేయడంలో స్విమ్స్ డైరెక్టర్ డా ఆర్.వి. కుమార్, వివిధ విభాగాధిపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైద్యపరంగా ఆయుష్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ రోజువారీ సగటు జనాభా 70తో సుమారు 75000 కేసులను నమోదు చేసిందని, వారికి సిద్ధ వైద్య సంప్రదింపులు, మందులు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తుందని తెలియజేశారు. మందుల కొనుగోళ్ళకు దాదాపు 5 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని 168 అవగాహన కార్యక్రమాలు మరియు 27 కమ్యూనిటీ క్యాంపులను కూడా నిర్వహించడం జరుగుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరఫి కాలేజ్ ప్రిన్సిపల్ డా కె. మాధవి, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డా? సుధారాణి ప్రొ? డా? సెంథిల్ కుమార్, వెలుమలై, సిద్ధ వైద్య రీసెర్చ్ ఆఫీసర్ శ్రీదేవి, డా? కార్తిక, డాఎఎ రాజలక్ష్మి, డా కె అరుణాచలం అనిల్ సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీ బాలాజీ కాలనీ వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లతా బాలాజీ, ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కోశాధికారి చిరంజీవి రెడ్డి, కమిటీ సభ్యులు భక్తులు అధ్యక్ష సంఖ్యలో పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీఆర్.కే.వి.బి.పేట పంచాయతీ



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం మండలం బూత్ నంబర్ 102లో కార్యక్రమం చేస్తున్న తెలుగు దేశం పార్టీ కార్వేటినగరం మండలం ఎస్. సి.సెల్.ప్రధాన కార్యదర్శి బి.ఎల్. ఏ. చెంగల్ రాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేయబోయే మ్యానిఫెస్టోలోని అంశాలు.ఆడబిడ్డ నిధిలి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు.తల్లికి వందనంలి పథకం క్రింద ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి 15,000 రూపాయలను ఖాతాల్లో జమ చేస్తారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం.ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలుబీసీలకు రక్షణ చట్టం పూర్ టు రిచ్ పథకం గురించి ప్రజలకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటర సందాని, మండల డాటాఅనాలసిస్ట్ కిషోర్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని పోస్ట్ కార్డుల ఉద్యమం



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మండల కార్యాలయ ఆవరణంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పనిచేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు నిరవధిక సమ్మెలో భాగంగా పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయం నుంచి స్థానిక పోస్టల్ కార్యాలయం వరకు నిరసన తెలుపుతూ పోస్ట్ కార్డులను తపాలా కార్యాలయంలో వేసి, స్థానిక శాసనసభ్యులు మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామి గృహ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. కనీస వేతనం కావాలి, గ్రాడ్యుటీ ఇవ్వాలి, ఎఫ్ ఆర్ ఎస్ యాప్‌ను రద్దు చేయాలి, ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి అంటూ వినూత్నంగా నిరసన వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా అంగన్వాడి ఉద్యోగులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అనుసరించి వేతనాలను పెంచాలని మా సమ్మె కొనసాగుతున్న పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, పని భారాన్ని ప్రభుత్వం పెంచిన మా కష్టాన్ని, మా సేవలను గుర్తించి ఉద్యోగ భద్రతతో పాటు కనీసం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పురం, వెదురు కుప్పం, కార్వేటినగరం, అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు, సిఐటియు నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# నాడు ప్రజావేదికను కూల్చి ప్రజలకు దూరమైన జగన్

**- జనసేన ఇంచార్జి ఎమ్మెల్యే డాక్టర్ యుగంధర్**



**కార్వేటినగరం (మేజర్ న్యూస్) :** కార్వేటి నగరం మండలం, యం యం విలాసం పంచాయితి, వడ్డీ ఇండ్ల వద్ద కూడలిలో జనసైనికులు ఏర్పాటు చేసిన దిమ్మను స్టానికి మండల తహసీల్దార్ మరియు సిబ్బందితో వచ్చి కూల్చి వేశారు. అంతకుముందే విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్చార్జి మరియు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ యుగంధర్ పొన్న వడ్డీ వీళ్లకు చేరుకొని గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. గ్రామానికి ఆనుకుని చెరువుల నున్న నిధులు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ఉండటం వలన ఇప్పటికే అనేకమంది ప్రయాణికులు పడిపోయారు. దోమల అధికమై గ్రామస్తులు ఇబ్బంది పడ సాగుతున్నారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ నాడు ప్రజావేదికను కూల్చి ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దూరమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు వడ్డి ఇండ్ల గ్రామంలో దిమ్మను కూల్చి పొముఖ్యమంత్రి నారాయణస్వామి ఎమ్మెల్యే టికెట్ కోల్పోయారని ఎద్దేవా చేసారు. ఆ ప్రాంతంలో జనసేన జెండాను ఎగరవేయడం ఖాయమని తెలియ జేసారు. ఏది ఏమైనా ఇక మూడు నెలల మాత్రమే మీ ప్రభుత్వమని, మూడు నెలల తర్వాత జనరంజక పాలన వస్తుందని తెలిపారు. వడ్డీ ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల పట్టాలి ఇంకా మంజూరు చేయలేదని, నిత్యం రోడ్ల మీద ప్రవహిస్తున్న నీటిని పైపుల ద్వారా బయటికి పంపించలేకపోతున్నారని, కలికిరిండ్ల వద్ద ఒక వైసీపీ నాయకుడు జాతీయ రహదారి ప్రక్కన రోడ్లు భవనముల శాఖ స్థలంలో అక్రమంగా కట్టుకున్నరెండు ఇండ్లను తొలగించ లేకపోతున్నారని, అలాంటి అధికార యంత్రాంగం ఇక్కడ పనిచేస్తుందని, చేతకాని వ్యవస్థలో ప్రజలు మగ్గుతున్నారని, వైసీపీకి చరమగీతం పడాల్సిన రోజులు దగ్గరపడ్డాయని ఈ సందర్భంగా తెలిపారు. దిమ్మను తొలగించిన అధికారులు, అక్రమ కట్టడాలను, అక్రమ దిమ్మలను, అక్రమ స్థలాలను, అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లను తొలగించే దమ్ముందా అని ప్రశ్నించారు. అసమర్థులైన పాలకుల మాట విని ఇబ్బందులు తెచ్చుకోవద్దని ఈ సందర్భంగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం మండల అధ్యక్షులు శోభన్ బాబు, టౌన్ కమిటీ అధ్యక్షులు రాజేష్, జిల్లా సంయుక్త కార్యదర్శులు రాఘవ, నరేష్, నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నియోజకవర్గ కార్యదర్శి అన్నామలై, మండల బీసీ సెల్ అధ్యక్షులు దేవా, యం యం విలాసం పంచాయతీ అధ్యక్షులు రుద్ర, జనసేన నాయకులు నాదముని, పాలసముద్రం మండల అధ్యక్షులు లతీష్, జన సైనికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోయకొండ ఆదాయం నలబై ఆరులక్షలు

**చౌడేపల్లి(మేజర్ న్యూస్)**



మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు నేడు హుండీ లెక్కింపు జరిగినది.యాబై రోజులకు గాను నగదు 46,04,427 రూపాయలు,బంగారం 52 గ్రాములు,వెండి 480 గ్రాములు ,విదేశీ కరెన్సీ ఒకటి వచ్చింది.అలాగే రణబేరి గంగమ్మ దేవస్థానం ఆదాయం 34,850 వచ్చింది. హుండి లెక్కింపు బోయకొండ దేవస్థానం పాలక మండలి చైర్మన్ వి.నాగరాజ రెడ్డి ఆద్వర్యం లో జరిగినది.సదరు హుండి లెక్కింపునకు దేవస్థానం దర్మకర్తల మండలి సభ్యులు రాం దాస్ ,రాజేష్,భారతి,హైమావతి,రెడ్డెమ్మ ఆలయ ప్రధాన అర్చకులు,గ్రూపు దేవస్థానముల కార్యనిర్వాహక అధికారి సుబ్రమణ్యం నాయుడు,చౌడేపల్లి పోలీసులు,ఇండియన్ బ్యాంకు సిబ్బంది,దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.ఇండియన్ బ్యాంకు పుంగనూరు వారు కౌంటింగ్ మిషన్లు రెండు విరాళంగా ఇచ్చారు.

## టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి కృషి చేయాలి-డాక్టర్ థామస్



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** గంగాధర నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తనను గెలిపించాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ డాక్టర్ వి ఎం థామస్ ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని తెల్ల గుండ్లపల్లి లో గురువారంమన ఇంటికి మన థామస్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న శాసనసభ ఎన్నికల్లో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తాను సామాన్య దళిత కుటుంబానికి చెందిన వాడని, తాను కష్టపడి చదివి డాక్టర్ వృత్తిలో రాణించానని, డాక్టర్ గా ఎంతోమందికి సేవలు అందించానన్నారు. గంగాధర నెల్లూరులో అన్ని వర్గాల వారికి సేవలు అందించడానికి తాను రాజకీయాల్లో అడుగుపెట్టానని, తనను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. మన ఇంటికి మన థామస్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రతి గ్రామంలో ప్రజలు పూలమాలలతో సన్మానించి, నీరజనాలు పలికారు. ఇటీవల ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ గా నియమితులైన గురుశాల కిషన్ చందుకు థామస్ అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోకనాథ్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కుప్పయ్య, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, టిఎన్టియుసి నాయకుడు చక్రి, టిడిపి కార్యకర్తలు సతీష్, ప్రతాప్, వెంకటాద్రి నాయుడు, సుధాకర్, యువత పాల్గొన్నారు.

## కుప్పం టీడీపీ నేత త్రిలోక్ కు చంద్రబాబు పరామర్శ



**కుప్పం,మేజర్ న్యూస్:** కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులు త్రిలోక్ ను పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బెంగుళూరులో పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం జరిగిన ప్రమాదంలో త్రిలోక్ తీవ్ర గాయాల పాలయ్యాడు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై నిరసనల సమయంలో ఈ ప్రమాదం చోటుచేకుంది. ప్రమాద తీవ్రత కారణంగా ఇప్పటికీ త్రిలోక్ పూర్తిగా కోలుకోలేదు. అసుపత్రిలో చికిత్స అనంతరం బెంగుళూరులో ఉంటున్న త్రిలోక్ ను చంద్రబాబు పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. త్రిలోక్ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## ప్రయివేటు ఎరువులు తరలించే వాహనానికి ప్రభుత్వ బోర్డు

**చౌడేపల్లి(మేజర్ న్యూస్)**



మండలం లోకి ఫర్టిలైజర్స్ తీసుకొచ్చిన లారీ నెంబర్ ఏ.పి.21టి.ఎ 4977 గల లారీ పైన కర్నూలు జిల్లా కలెక్టర్ వారి అనుమతులు అని రాసి వుంది. అందులో ఎరువులు, బియ్యం రైల్వేగూడ్స్ షెడ్డు నుండి బళ్ళారి చౌరస్తా గోడాం వరకు అని స్పష్టంగా రాసిఉంది.ఐతే కర్నూలు లో దించాల్సిన ఎరువులు చౌడేపల్లి కి అక్రమంగా తరలించారా? అని అనుమానం తో సూర్య ప్రతినిధి లారీ డ్రైవర్ ను అడుగగా అతను మొదట రేషన్ బియ్యం అన్నాడు,రేషన్ బియ్యం ఐతే చిత్తూరు జిల్లా కలెక్టర్ వారి అనుమతి ఉండాలి కదా అని అడిగితే కాదు ఫర్టిలైజర్స్ అని సమాధానం చెప్పాడు.ఎక్కడి నుండి లోడ్ అని అడిగితే కర్నూలు నుండి అని చెప్పాడు.ఐతే అనుమతులు ఉన్న బ్యానర్ పైన గల లారీనెంబర్,వచ్చిన లారీ నెంబర్ల లో వ్యత్యాసం ఉన్నాయి.వచ్చిన లారీ నెంబర్ ఏ.పి.21 టి.ఏ 4977 ఐతే కర్నూలు జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చిన లారీ నెంబర్ ఏ.పి.07 వై 7155 గా ఉన్నాయి.

## ఆందుదాం ఆంధ్ర లో బ్యాడ్మింటన్



**చౌడేపల్లి(మేజర్ న్యూస్)**

ఆడుదాం ఆంధ్ర లో భాగంగా నేడు మండలంలో చారాల సచివాలయం పరిధిలో బ్యాట్మెంటన్ పోటీలు జరిగాయి. ఇక్కడ పాల్గొన్నదే రెండు జట్లు కాబట్టి ఒకటి విన్నర్స్, ఒకటి రన్నర్స్, ఈ కార్యక్రమాన్ని పరివేక్షణకు ప్రత్యేక అధికారిగా డి.ఆర్.డి.ఏ వెలుగు ఏ.పి.యం నర్సోత్తమ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి సచివాలయం మహిళా పోలీస్ మణిమాల, డిజిటల్ అసిస్టెంట్ నాగరాజు,సెరికల్చర్ అసిస్టెంట్ పాపయ్య, వాలంటీర్లు చైతన్య, పుష్ప, గోపి, రెడ్డి శేఖర్, పరమేష్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాకాలలో కర్మక్రియలకు తుడా చైర్మెన్ హాజరు

**- మాజీ సర్పంచ్ భర్త లోకనాథం చిత్రపటానికి నివాళులు**



**పాకాల మేజర్ న్యూస్ :** పాకాల మండలం మద్దినాయన పల్లి పంచాయతీ కోనేటిబోయి నిల్లు మాజీ సర్పంచ్ ధనమ్మ భర్త, డీలర్ లోకనాథం ఇటీవల మృతి చెందారు. గురువారం కర్మక్రియలకు తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. లోకనాథం చిత్రపటానికి మోహిత్ రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పలువురు పార్టీ నేతలు లోకనాథం చిత్ర పటానికి నివాళులు అర్పించారు. మండలంలోని ఏ కార్యక్రమం జరిగిన నాదంటూ ముందుకు పోయి కుటుంబ సభ్యుల్లో సభ్యుడుగా ఉంటూ వారికి తన వంతు సహాయం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ ప్రజల గుండెల్లో బాధితుల గుండెల్లో దేవుడు లాగా ఉండిపోతున్నాడు అనేకమంది మండల ప్రజలు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని దీవిస్తున్నారు

## కుప్పం బాదూరు ఉన్నత పాఠశాల తనిఖీ

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రాపురం: మండలంలోని కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కడప ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఐఎఫ్పి ప్యానెల్ బోర్డులు, మరుగుదొడ్లు, ట్యాబ్ లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు బైజూస్ కంటెంట్ వీక్షించిన వివరాలను యాప్ లో నమోదు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్లు, రోజువారి టీచర్ డైరీలను తప్పక రాయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదవ తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ క్రమంలోనే పాఠశాలలో జరుగుతున్న సబ్జెక్ట్ సీఆర్పీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, డివైఈవో ఆనంద రెడ్డి, ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయ వేలు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రజని తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జడ్పీ చైర్మన్

**పెద్దపంజాణి,మేజర్ న్యూస్ :** పెద్దపంజాణి ఎంపిడిఓ కార్యాలయాన్ని గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ జి. శ్రీనివాసులు అలియాస్ వాసు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని మండల పరిషత్తు సిబ్బంది హాజరు పట్టికను, సచివాలయ సిబ్బంది ఆన్లైన్ హాజరు పట్టికను పరిశీలించి, ప్రతి ఒక్క సిబ్బంది సమయపాలన పాటించాలని, సక్రమంగా విధులకు హాజరు కావలెనని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, విజయవంతం చేయుటలో విశేష కృషి చేయాలని ఎంపిడిఓ మరియు కార్యాలయ సిబ్బందికి తెలియజేశారు. రానున్న జనవరి మాసంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు (ఆరోగ్య సురక్ష, వైస్సార్ చేయూత, వైస్సార్ ఆసరా, అంబేద్కర్ విగ్రహావిష్కరణ )అమలవు తున్నందున, మండల, గ్రామ సచివాలయ సిబ్బంది అందరూ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయుటకు విశేష కృషి చేయాలని కూడా సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతము జరుగుచున్న ఎన్ఆర్ఈజీఎస్, జెజిఎంపి వంటి అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి, చెల్లింపుల బిల్లులు తయారు చేసి, సంబంధిత వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. పూర్తి కాబడిన పనుల ప్రారంభోత్సవాలకు తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపిడిఓ ను జడ్పీచైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అబ్దుల్ రహీం, ఈ ఓ ఆర్ డి శారదాదేవి, స్థానిక నేతలు బాగా రెడ్డి, మండల సిబ్బంది పాల్గొన్నారు.

## వర్మీ కంపోస్ట్ తయారుచేయాలి

**- జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి**

**పెద్దపంజాణి,మేజర్ న్యూస్:** డంపింగ్ యార్డులలో వర్మీకంపోస్ట్ తయారుచేయాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని పెద్దపంజాణి, కోగిలేరు, రాయలపేట పంచాయతీ కేంద్రాల్లో ఉన్న డంపింగ్ యార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ ద్వారా లభించే తడి చెత్త పొడి చెత్తలను వేరుచేసి తద్వారా వచ్చే ఎరువులతో వర్మీకంపోస్టు తయారు చేయించాలని సూచించారు ఈ సందర్భంగా పంచాయతీ సచివాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో కోగిలేరు, రాయలపేట, పెద్దపంజాణి, సర్పంచులు రమేష్ బాబు, అరుణ, అఖిల ,ఈవోపీఆర్డి శారదాదేవి, పంచాయతీ కార్యదర్శులు మహేశ్వర్, గణపతి, సుబ్రమణ్యం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

**రామచంద్రాపురం, మేజర్ న్యూస్**

రామచంద్రాపురం, సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకుందామని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రతాప్ స్వామీజీ అన్నరు. రామచంద్రాపురం మండలం, తిమ్మరాజు పల్లి సమీపంలోని ఏకవీర ఫౌండేషన్ సురభి గో శాల వద్ద గురువారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలనతో దేవతార్చన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది, తిరుపతి జిల్లా యస్సీయస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు మెమిడి లీలా కృష్ణణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ స్వామీజీ మాట్లాడుతూ కర్మభూమి ధర్మ భూమి వేద భూమి అయిన భరత భూమిలో పుట్టటం మనం పూర్వ జన్మలో చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. భారతీయులుగా పుట్టినందుకు మనమెంతో గర్వపడాల్సిన అవసరం ఉందని చెప్పారు.




శ్రీరామచంద్రుడు అయోధ్యలో దేవాలయ ప్రవేశం చేసే పుణ్యకాలాన్ని అందరం చూసి తరిద్దామన్నారు. రిటైర్డ్ సూపరెంట్ ఇంజనీర్ సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షులు మన్మథరావు మాట్లాడుతూ శ్రీరామ విజయ మంత్రం మనందరికీ సర్వ రక్షా కరమన్నారు. రాముడు కారణజన్ముడని ఈ భారత అవనిలో అడుగడుగున సంచరించిన మహాత్ముడని తెలిపారు.రామచంద్రుడు వేల సంవత్సరాల క్రితం తిరిగిన ఆనవాళ్ళు నేటికి మనకు గోచరిస్తున్నట్లు గుర్తు చేశారు.రామజన్మ భూమిలో తిరిగి విగ్రహ ప్రతిష్ట చేసుకోగలిగారు ఎంతో గొప్ప విషయం అన్నారు.ఆర్ యస్ యస్ ప్రాంత సహకార్యవాహ దువ్వూరు యుగంధర్ మాట్లాడుతూ స్వధర్మము శ్రేయోభిదాయకమని ,పర ధర్మం భయావహము అనుచితమని చెప్పారు.హిందూ ధర్మములో వున్న పవిత్రత ఎంతో ఉత్తమైనదన్నరు. రాముడు దేవాలయ ప్రవేశం అందరం మనింటి పండుగగా జరుపుకుందామన్నరు.పిల్లలు భగవద్గత సారాంశాన్ని చక్కగా వివరించారు.వివిధ అంశాలలో గురువర్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింహపురి సమరసతా ఫౌండేషన్ స్ఫూర్తియ ధర్మ ప్రభోదకులు వెందర్ రెడ్డి, తిరుపతి జిల్లా ధర్మ ప్రభోదకులు దొరకుమార్ , జిల్లా సహ సంయోజిక్ బోడి రెడ్డి వెంకటరెడ్డి, మండల ధర్మ ప్రభోదక్ ముని కృష్ణమ నాయుడు, మహిళా అధ్యక్షురాలు బండి జామున,పలువురు హిందూ బంధువులు,ఆత్మ బంధువులు,భజన బృందాలు పాల్గొన్నరు.

## గర్భిణీకి తుడా చైర్మెన్ ఆశీస్సులు



**పాకాల, మేజర్‌న్యూస్:** పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారి పల్లికి చెందిన చాముండేశ్వరి కి తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆశీస్సులు అందించారు. గురువారం ఆమె శ్రీమంతం సందర్భంగా వేడుకకు మోహిత్ రెడ్డి హాజరయ్యారు. వైఎస్ఆర్సీపీ కార్యకర్త సూరి, భార్య చాముండేశ్వరి తల్లి దండ్రులు కాబోతున్న తరుణంలో తోబుట్టువుగా భావించి మంచి మనస్సుతో ఆశీర్వదించారు. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** ఆంధ్ర రాష్ట్రంలో అంగన్వాడి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మె చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో, ఈ విషయాన్ని చిత్తూరు జిల్లా జాతీయ మానవ హక్కులు కమిటీ బృందం జాతీయ మానవ హక్కుల అధ్యక్షులు మండికల్. నాగరాజు , జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి ప్రసాద్‌ని కలిసి వినతి పత్రం అందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. జాతీయ అధ్యక్షులు కర్ణాటక రాష్ట్రంలో పర్యటను తెలుసుకున్న జిల్లా కమిటీ బృందం నేరుగా వెళ్లి అంగన్వాడీలు పడుతున్న సాధక బాధలను క్లుప్తంగా వివరించారు. అంగన్వాడీలకు గ్రా డ్యూటీ కేంద్రం పరిధిలో ఉందని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పదేపదేగా చెబుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నామని తెలిపారు. గతంలో సుప్రీం కోర్ట్ అంగన్వాడీలను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి గ్రాడ్యుటి ఇవ్వాలని ఆదేశించినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయస్థానాల ఆదేశాలను కూడా పట్టించుకోలేదని వివరించారు. ఈ విషయం పైన జాతీయ అధ్యక్షులు స్పందిస్తూ తప్పకుండా ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానని, అంగన్వాడీల సమ్మెకు జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అంగన్వాడీలకు ఏ సమస్య వచ్చినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో సంస్థ బృందం ముందుండి పనిచేస్తుందని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో డివి మునిరత్నం, వేలాయుధం, రవికుమార్, పార్థసారథి, ఆనంద్, శ్రీనివాసులు, శ్రీకాంత్, మనీ, పాల్గొన్నారు.

## పుస్తకాలే నిజమైన స్నేహితులు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పుస్తకాలే నిజమైన స్నేహితులని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు అన్నారు. గురువారం గురుకుల పాఠశాలలో పిల్లలకు గ్రంథాలయ పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా గంగవరం మండల విద్యా శాఖ అధికారులు వేణుగోపాల రెడ్డి, వ శ్రీనివాసులు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని 17వ రోజు ధర్నా

**- ముఖ్యమంత్రికి పోస్టు కార్డులతో నిరసన**



**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు మండలంలో అంగనవాడి వర్కర్లు హెల్పర్స్ ఆఫీసు ఐసిడిఎస్ నందు28తేదీ గురువారం ఆఫీసు నందు అంగన్వాడీలు 17 రోజులు కూడా నిరసన తెలిపారు ఈ నిరసనకి సిఐటియు సిఐటి జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధర్ గుప్తా సుబ్రహ్మణ్యం అధ్యక్షన జరిగినది రాష్ట్ర నాయకులు వి ఆర్ జ్యోతి. ఏ యు టి సి శాంతి సిఐటియు భారతివారి ప్రగతిశీల సరస్వతి మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం 2019 న పాదయాత్రలో ఇచ్చిన మాట తెలంగాణ కంటే అదనపుగా జీతం ఇస్తామని చెప్పిన మాట ఏమిటి అంగన్వాడీలు నాలుగున్నర సంవత్సరం నుండి మన ముఖ్యమంత్రి వర్యులు మన అంగనవాడిని సమస్యలు తీరుస్తారని వారు ఓపిగ్గా ఉన్నారు డిమాండ్ పరిష్కరించాలని 28రోజులు ముందే ముఖ్యమంత్రి గారికి వారు స్పందన లేకుండా పోవడం వలన సమ్మెకు దిగాల్సి వచ్చింది. ఆ తరువాత ఎనిమిదో తేదీన సమ్మె చేస్తామని చెప్పి మరల26వ తేదీకి చర్చలకు పిలిపించి సమస్య పరిష్కరించలేదు అందుకే అంగన్వాడీలు ఈరోజు 17రోజులైనా సరే సమస్య పరిష్కరించే వరకు 3 తేదీ కలెక్టర్ ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరిక చేశారు ఈరోజు పరిష్కరించకపోతే పోరాడుతున్నారని మీకు ఉద్యమాలు భారీగా చేస్తామని వామపక్షాలు కల్పించుకుని ముందుకు వెళ్తామని పూర్తిగా మద్దతు వారు తెలిపారు దీనికి ఈ సమ్మెకు అన్ని సంఘాలతో కలిపి మరో ఉద్యమం చేస్తామని వారు పిలుపునిచ్చారు. అంగన్వాడి వర్కర్స్ అని హెల్పర్స్ అన్ని మండలాల నుంచి సిఐటియు ఏ యు టి సి ఐ ఎఫ్ టి యు ప్రగతిశీల మొదలగు అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## ఆట అదుర్స్..

**- యువతలో ఉత్సాహం నింపుతున్న.. ఆడుదాం ఆంధ్ర**

**- 3వ రోజు చెలరేగి ఆడిన క్రీడాకారులు**

**- ఆర్‌సి పురంలో పర్యటించిన తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర ' ఉత్సాహాభరితంగా సాగుతోంది. గురువారం 3వ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో రామచంద్రపురం మండలంలో నీ ఆయా పంచాయతీల్లో టోర్నీలు హోరా హోరీగా సాగాయి. తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను మండల పరిధిలో పర్యటించి పర్యవేక్షించారు. తనకిష్టమైన క్రికెట్ ను ఆడి యువతను ఉత్సాహ పరిచారు. క్రీడల నిర్వహణ, క్రీడాకారుల అనుభవాలను ఆరా తీస్తూ మోహిత్ రెడ్డి ముందుకు సాగారు. క్రీడాకారులకు కిట్లు అందజేశారు. ఆర్సీపురంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రసవత్తరంగా సాగింది. తుడా చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆ తరువాత వారితో కలిసి క్రికెట్ ఆడారు. మిగిలిన క్రీడలను పర్యవేక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించారు. ఆయా పంచాయతీల్లో అధికారులు, వైఎస్ఆర్సీపీ నాయకులు రామచంద్రపురం మండల వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు ఢిల్లీ రాణి భాను కుమార్ రెడ్డి, పుష్ప కాంత్ రెడ్డి, మురళి రెడ్డి, రామాపురం సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, గురుస్వామి రెడ్డి, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతంగా నిర్వహించారు.

## సారూ... స్మశానానికి దారి ఏర్పాటు చేయండి ?

**శ్రీకాళహస్తి రూరల్ మేజర్ న్యూస్** : శ్రీకాళహస్తి మండలం గుంట కింద పల్లి గ్రామంలో స్మశానానికి దారి కల్పించండి అంటూ బాధితులు పేర్కొంటున్నారు. మరణించిన తర్వాత కూడా ప్రశాంతంగా బాధితులను స్మశానానికి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని. ఓవైపు ఆక్రమణలు మరోవైపు దారి సమస్యలతో మొరపెట్టుకుంటున్నామని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన స్మశాన స్థలాలు దారి సమస్యలు తీరు మారటం లేదని. అయినా ఇకనైనా రెవెన్యూ ప్రభుత్వ అధికారులు స్పందించి దళిత కాలనీల స్మశాన స్థలాలు కాపాడాలని రోడ్డు సమస్యలు పరిష్కరించాలని కోరారు.


స్మశానానికి దారి లేక అవస్థలు పడుతున్న ప్రజలు

## ముని ప్రసాద్ కుటుంబానికి వైయస్సార్ బీమా ఆర్థిక సహాయం

**- వైయస్సార్ పార్టీ నేత ఉన్నం వాసుదేవ నాయుడు**



**తొట్టంబేడు మేజర్‌న్యూస్:** తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం ఎస్సీ కాలనీలో ఇటీవల నాలుగు రోజులు క్రితం ప్రమాదం శాత్తు జి ముని ప్రసాద్ మరణించడంతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, మండల ఎంపీపీ నిర్మలమ్మ సూచనలు మేరకు వైయస్సార్ బీమా పథకం కింద లక్ష రూపాయలు మంజూరు చేయడం జరిగింది, మండల వైసిపి నాయకులు ఉన్న వాసుదేవ నాయుడు చేతుల మీదుగా దహన ఖర్చులకు 10,000 రూపాయలు అందజేశారు, మిగతా అమౌంట్ బాధితుడు భార్య శైలజ అకౌంట్లు బ్యాంకు ద్వారా జమ అవుతుందని సచివాలయం అధికారి మనోజ్ తెలియజేశారు, అదేవిధంగా మండల వైసిపి సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు తన వంతు సహాయం 10000 వేలు ఆర్థిక సాయం చేశారు, ఆ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి, మండల ఎంపీపీ నిర్మలమ్మ, మండలవైసిపి సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ సక్కుబాయమ్మ కు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మనీ, సచివాలయం అధికారి, మనోజ్, గ్రామ వాలంటీర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు మానుకోవాలి

**అంగన్వాడీ సమ్మె విరమణకు ప్రయత్నం చేయాలి : వైఎస్ మణి**

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అంగన్వాడి కార్మికులు సమ్మె 17వ రోజుకు చేరుకోంది ప్రభుత్వం అంగన్వాడీ సమ్మె పైన తప్పుడు ప్రచారాలు చేస్తుంది దీనివల్ల ప్రభుత్వానికి జగన్మోహన్ రెడ్డికి ఎలాంటి ప్రయోజనం చేకూరదు అని ఏఐటియుసి శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వైయస్ మణి అన్నారు. శ్రీకాళహస్తి తొట్టంబేడు అంగన్వాడీ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరానికి ఏఐటియుసి ప్రతినిధి బృందంతో కలిసి ఆయన వెళ్లి సంఘీభావం ప్రకటించి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సమ్మె చాలా న్యాయమైంది. ఎందుకంటే అంగన్వాడీ కార్మికులు చేస్తున్నది న్యాయమైన పోరాటం పెరుగుతున్న జీతాలకు అనుగుణంగా వారి జీతాలు పెంచమనే పోరాటం వారికి సుప్రీంకోర్టు చెప్పిన విధంగా గ్రాట్యుటీని ఇమ్మనేటువంటి పోరాటం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చమని దాని కోసం జరుగుతున్న పోరాటం నాణ్యమైన పౌష్టికాహారం పిల్లలుకు గర్భిణులకు ఇవ్వాలని జరుగుతున్న పోరాటం ఈ పోరాటానికి ప్రజలు మద్దతు ఉంది ఈ పోరాటానికి ప్రతిపక్షాల మద్దతు ఉంది ఈ పోరాటానికి ప్రభుత్వ వ్యతిరేకత తప్ప రాష్ట్రంలో సానుకూల వాతావరణం ఉంది ప్రజలంతా ఈ సమ్మెను పరిష్కరించాలి అని కోరారు.ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి బేషజాలకు పోకుండా ఇప్పటికైనా సమ్మె పరిష్కారం దశగా ప్రయత్నం చేస్తే బాగుంటుంది తప్ప తప్పుడు ప్రచారాలతో మభ్య పెట్టాలి అనుకుని చూస్తే రానున్న కాలంలో అంగన్వాడీ కార్మికులు తగిన బుద్ధి చెబుతారు అని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమలో ఏఐటీయూసీ నాయకులు సిపిఐ నాయకులు మోహన్ రెడ్డి మురళి కార్తీక్ రజాక్ అంగన్వాడీ యూనియన్ నాయకులు ఐఎఫ్టియు సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ నిరోదక చట్టంపై అధికారులకు అవగాహన

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** ప్రగతి సంస్థ, తిరుపతి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్యాలయంలో డివిజన్ స్థాయి బాల్య వివాహ నిరోధక అదికారులు సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో ప్రగతి డైరెక్టర్ కెవి రమణ మాట్లాడుతూ బాల్య వివాహం అనే అంశం మన దేశంలో లోతుగాఉన్న సమస్య. దేశ వ్యాప్తంగా కౌమార బాలికలు జీవితాలుపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఈ బాల్య వివాహాలు బాలలు హక్కులను ఉల్లంఘించడమే కాక మొత్తం సమాజం పురోగతికి, అభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుంది. బాల్యం అనేది అమాయకత్వం, నేర్చుకొనడం, కలలు కనే సమయం, ఇది ఎదుగుదల, అన్వేషణ కాలమని అర్థం. యుక్త వయసులో బలవంతంగా బాల్య వివాహాలు చేయడం బాలల హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు దేశ అభివృద్ధికి అడ్డంకి అని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడడానికి వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాలు, సంస్థల సంయుక్త సహకారం ఎంతైనా



అవసరం, మన ప్రయత్నాలను ఒకటిగా చేసి పోరాడడం వలన బాలలు సాదికారతతో జీవించే మరో ప్రపంచాన్ని సృష్టించవచ్చు. ఈ ప్రపంచంలో బాలలు హక్కులు ఉల్లంగన కాకుండా చూసుకొనవాలసిన బాద్యత మన అదరిది అని తెలిపారు. ప్రగతి సంస్థ బాల్య వివాహాల నిర్మూలనకు చేస్తున్న కృషిని అబినందించారు. జిల్లా బాలల రక్షణ అదికారి శివశంకర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోదానికి 2006 లో తీసుకొని వచ్చిన చట్టం ప్రకారం మరియు జీవో ఎంఎస్ నెంబర్ 39 ప్రకారం, 18 సంవత్సరములు అమ్మాయికి, 21 సంవత్సరములు అబ్బాయికి పెళ్లి చేసుకొనే వయసుగా నిర్ణయించారు. బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులు మరియు సమానత్వంపై ప్రభావం చూపి తరచూ హింసకు లోనవడం జరుగుచున్నదని తెలిపారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ బాల్య వివాహాల గురించి సమాచారం ఇచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచడమే కాక బాల్య వివాహాలను ఆపి చట్టపరమైన చర్యలు తీసుకొనడం జరుగుతుంది అని తెలిపారు. శ్రీకాళహస్తి, రేణిగుంట సీడీపీఓలు శాంతిదుర్గ, కృష్ణమంజరిలు మాట్లాడుతూ బాల్య వివాహం యొక్క ప్రభావం వ్యక్తిగత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది, బాల్య వివాహాలపై ఉక్కుపాదం మోపి బాలికల ఉజ్వల భావిష్యత్తునకు మార్గం సుగమం చేయవలసిన భాద్యత ప్రతి ఒక్కరిది అని తెలిపారు. తల్లి తండ్రులకు బాల్య వివాహాల వలన కలుగు నష్టాలపై అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది అని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అదికారులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వివిద శాఖల అదికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు, డివిజనల్ ఇంజినీర్ లలిత, ఐసీడీస్ సూపర్వైసర్లు, ప్రగతి కోఆర్డినేటర్ తులసీరాం రెడ్డి, ఏపీ యానాది సంఘం అద్యక్షులు కోటయ్య ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

## భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి : న్యాయవాదులు

**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి కోర్టు న్యాయవాదులు భూ హక్కు చట్టం రద్దు చేయాలని శ్రీకాళహస్తి కోర్టు ఆవరణం నుండి శ్రీకాళహస్తి ఆర్డిఓ, ఎంఆర్ ఓ కార్యాలయాలకు బైక్ ర్యాలీ తమ నిరసనను తెలిపి అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన



భూహక్కు చట్టం వెంటనే రద్దుచేయాలని కోరారు. ఈ చట్టం ద్వారా సామాన్య ప్రజలు తమ భూమిపై హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని,ఈ చట్టం అమలు పరచడం వలన సామాన్యుడు తమ సొంత భూమిని నిరూపించుకోవా లంటే హైకోర్టుకు వెళ్ళాసిన పరిస్థితి ఏర్పడుతుందని, దీనివలన వ్యయ ప్రయాసలు కలిగి ప్రజలు,రైతులు నానా ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలియజేశారు. ఈ భూహక్కు చట్టాన్ని రద్దు చేసేవరకు ప్రజలు, రైతుల పక్షాన న్యాయవాదులు నిలబడి పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి కోర్టు న్యాయవాదులు, న్యాయవాది మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ 138 వసంతాలు సందర్భంగా ఉత్సవాలు

**- పిసిసి కార్యదర్శి డాక్టర్ బత్తయ్య నాయుడు**



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** కాంగ్రెస్ పార్టీ 138 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీసీసీ జనరల్ సెక్రటరీ , శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జీ డాక్టర్ .ఎస్. బత్తైయ్య నాయుడు కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన వ్యక్తి ఒక బ్రిటిష్ వాడిని దానిని కాపాడుకుంటూ స్వతంత్ర సమరయోధులు అధ్యక్షులుగా ఉంటూ 1947 ఆగస్టు 15న పూర్తి స్వాతంత్రాన్ని గాంధీ నాయకత్వంలో జవహర్లాల్ నెహ్రూ , పటేల్ , అంబేద్కర్ ,తదుపరి హేమహేమీలు కృషితో స్వాతంత్రాన్ని సంపాదించుకోవడం జరిగింది. మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ కృషితో దేశంలో ప్రజాస్వామ్యాన్ని సంపాదించుకొని మతతత్వం లేని స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మించడంలో అయితే నేమి, దేశానికి ఇండస్ట్రీస్ అయితే నేమి, భారీ డ్యాములు వ్యవసాయానికైతే నేమి, పేద బడుగు దళిత వర్గాలను దృష్టిలో ఉంచుకొని దేశాన్ని కాపాడడం జరిగింది.

ప్రభుత్వ మత నిర్దేశాలను కుల మతాలను రచ్చ కొడుతూ గాంధీ ఫ్యామిలీ మీద అంటే జవహర్ లాల్ నెహ్రూ , ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, ఇప్పుడు ఉన్న గాంధీ ఫ్యామిలీని ఈడి ఇన్కమ్ టాక్స్ మొదలగు ఏజెన్సీలను ప్రయోగించి కేసులు పెట్టి రాహుల్ గాంధీని అరెస్టు చేయించి చాలా దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని, అంతేకాకుండా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ నిత్యవసర సరుకులను ఆకాశాన్ని అంటుతున్న ఏమి పట్టించుకోకుండా పేద, బడుగు, బలహీన వర్గాలు మీద జిఎస్టి ,తదితరులు టాక్సను మోపుతూ మోదీ నియంత్రణంగా వ్యవహరిస్తున్నారని కాబట్టి ప్రజలంతా ఏకమై, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకమై అందరూ రాబోయే 2024 ఎన్నికలలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని డాక్టర్. ఎస్. బత్తైయ్య నాయుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలోబీ బివి. శేఖర్, ఎం. వెంకట ముని, తుమ్మ. శివకుమార్, ఎం. వడివేలు మొదలియా, చిరంజీవులు, టీ.రాఘవరెడ్డి, ఈ. గోపి, ఎస్. శివయ్య, ఎస్. నాగూర్ అయ్యా, పి. కేశవులు, పి. సురేష్, టి మోహన, వెంకటయ్య, వానమ్మ, బానమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు. ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియజేస్తున్నాం.
కె. సురేష్ బాబు, ఫోన్ నెంబర్ : 94416 65773
ఎన్. లక్ష్మీనారాయణ ఫోన్ నెంబర్ : 63011 07116

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో కింద మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.
సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కెవిబి పురం

# గణిత పరిశోధనలకు గుర్తింపు ఇవ్వాలి : సర్వ జగన్నాథ్ రెడ్డి



తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్ : సనాతన భారతీయుల అధ్యయన పరిశోధనలకు గుర్తింపు లభించడం లేదని, 26 సంవత్సరాలుగా " పై- " పై నిర్వహించిన పరిశోధనలకు భారత ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని గణిత శాస్త్ర పరిశోధకులు సర్వ జగన్నాథ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన భారత దేశంలో పరిశోధకులకు జరుగుతున్న అన్యాయంపై ఆవేదనతో మాట్లాడారు. పైథాగరస్ సిద్ధాంతాన్ని భారతదేశానికి చెందిన బౌధాయనుడు 800 సంవత్సరంలోనే కనుగొన్నారన్నారు. అయితే 1400 సంవత్సరంలో గ్రీకు చెందిన పైథాగర ఈ సిద్ధాంతాన్ని కనుగొని ప్రోత్సహించేయడంతో నేడు పైథాగరస్ సిద్ధాంతంగా వెలుగులోకి వచ్చిందన్నారు. తాను 2003లో గణిత ఉపాధ్యాయుడిగా పదవి విరమణ పొంది ఆనాటి నుండి " పై " విలువకు ఖచ్చితమైన విలువను తెలుసుకోవడానికి 26 ఏళ్ల పాటు నిర్విరామంగా పరిశోధనలు జరిపానన్నారు. అంతిమంగా " పై " విలువ 1/4(14-రూట్ 2)౩3.14644660942గా నిర్ధారించానన్నారు. తాను కనుగొన్న ఖచ్చిత విలువపై సామాజిక మాధ్యమాల్లో ఎంతోమంది గణిత మేధావులు స్పందించి ప్రశంసలు అందించాలని, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లైబ్రరీలో దీనికి సంబంధించిన 27 సంపుటలు అందుబాటులో ఉంచామన్నారు. తాను కనుగొన్న " పై " కచ్చితంగా విలువకు భారత ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మాతృభాష తెలుగుపై పట్టుకల్పించాలి



వరదయ్యపాలెం,మేజర్ న్యూస్ : తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని మాతృభాష తెలుగుపై పిల్లల్లో పఠనాసక్తిని,అభిరుచిని,కలిగించేలా బోధన సాగించాలని మండల విద్యాశాఖ అధికారి గున్నయ్య అన్నారు.గురువారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య పర్యవేక్షణలో బి.ఎన్.కండ్రిగ,వరదయ్య పాలెం,సత్యవేడు మండలాల్లోని తెలుగు ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.కాలానికి అనుగుణంగా,నూతన పద్దతులను ఉపయోగించి విద్యాబోధన ఎలా చేయాలి,భాషా సామర్థ్యాలు సాధన,పది పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలపై అవగాహన వంటి వాటిపై విషయనిపుణులు యువశ్రీ మురళి తెలియజేశారు. ఈకార్యక్రమంలో పురుషోత్తం, నరేష్,మునెమ్మ లు మాదిరి పాఠ్యబోధన చేయగా,పల్లిపట్టు నాగరాజు,ఏడుకొండలు మోహన్ ఆచారి,అమర్నాథ్ రెడ్డి , శివారెడ్డి, గిరి,మునస్వామి,ఆనంద్,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లింపు : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్ : 2023-24 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపుకి ఈ నెలాఖరు 31వ తేది వరకు గడువు ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా పన్ను చెల్లించడానికి నాలుగు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు కనుక సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయన్నారు. కావున నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

# ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

తిరుపతి, మేజర్ న్యూస్ :జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24-7 నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కే. వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్ర పరచబడిన ఈవీఎం గోదామును గురువారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈవీఎం యంత్రాలకు కల్పించిన భద్రత పట్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి మరియు ఎస్డిసి కోదండ రామిరెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, టిడిపి మనోహరాచారి, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్ర శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రవి తదితరులు పాల్గొన్నారు.



# నిజాయితీకి.. నమ్మకానికి మారుపేరు డిప్యూటీ సీఎం



**పెనుమూరు, మేజర్ న్యూస్ :** గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రజల అభివృద్ధికి ఓ సేవకుడి లా పనిచేస్తున్న నారాయణస్వామి నీతికి నిజాయితీకి నమ్మకానికి మారుపేరని పెనుమూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి తో ఎంతో సన్నిహితంగా ఉంటూ ప్రజలకు సేవలు అందించడంలో వైయస్సార్ కుటుంబంలో ఓ గుర్తింపు పొందిన నాయకుడు నారాయణస్వామి అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తో కలిసి పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు కృషి చేస్తూ జగన్మోహన్ రెడ్డి గుండెల్లో స్థానం సంపాదించుకున్న ఏకైక నాయకుడు నారాయణస్వామి అన్నారు. రెండు పర్యాలు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొందిన నారాయణస్వామి నియోజకవర్గంలోని పెనుమూరు మండలం కలిగిరి కొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం టిటిడిలు లీనం చేయడం , 50 పడకల ఆసుపత్రి మంజూరు, టిటిడి కళ్యాణమండపం మంజూరు, ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, ప్రజా సంక్షేమం కోసం సంక్షేమ పథకాల అమలు వంటి ఎన్నో పథకాలు తీసుకొచ్చిన నారాయణ స్వామికి తిరిగి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం పట్ల పెనుమూరు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. నారాయణస్వామి పై నమ్మకం ఉంచి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్లు తిరిగి మరోసారి నారాయణ స్వామికి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి గంగాధర్ లో నియోజకవర్గ ఆరు మండలాల వైకాపా నాయకులు రుణపడి ఉంటామని రాబోవు ఎన్నికల్లో నారాయణ స్వామికి అఖండ మెజార్టీతో గెలిపిస్తామని వరా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, వైకాపా యువత అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, నాయకులు యత్తిస్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో "చంద్రగిరి' భవిష్యత్తు..!

**- మేల్కోనాకపోతే 20 ఏళ్లు వెనక్కి...**

**- ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే...**



చంద్రగిరి, మేజర్ న్యూస్ : వైసీపీ పాలనలో చంద్రగిరి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని, నియోజకవర్గంలోని అన్ని వ్యవస్థలు ప్రమాదంలో ఉన్నాయని చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు.. "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని'" "బాబు ఘూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె చంద్రగిరి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికి తిరిగి ఆర్టీసీ, విద్యుత చార్జీల పెంపు, రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అరాచక పాలన, ప్రభుత్వ వైఫల్యాల గురించి ప్రజలకు తెలియజేశారు.

ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఇకనైనా మేల్కోనాకపోతే మరో 20 ఏళ్లు వెనుకబడి పోతామని పులివర్తి సుధారెడ్డి చెప్పారు. నాలుగు పదవులు ఇచ్చింది నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికా లేక వ్యక్తిగతంగా లబ్ది పొందడానికా అని ప్రశ్నించారు. కనీసం నాయకులు, కార్యకర్తలు అయినా గుర్తున్నారా...? అని ప్రశ్నించారు. కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు ప్రజలకు సమాధానం చెప్పలేక ఇళ్లు కదలడం లేదని ఆరోపించారు. ఎంపీపీ'లు, జెడ్పీటీసీ'ల మానసిక క్షోభ వర్ణనాతీతం అన్నారు. ఓ పక్క దాడులు, దౌర్జన్యాలు, మరోపక్క ధరల బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఇక సాగనంపాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ అవసరాలకు, ప్రజల సౌకర్యాలకు సెంటు భూమి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్మశాన వాటికలు లేని గ్రామాల పరిస్థితి.. అభివృద్ధికి అద్దం పడుతున్నాయని వెల్లడించారు. పులివర్తి నానికి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని రోల్ మోడల్ గా నిలుపుతారాని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# లేపాక్షి కాటన్ అండ్ సిల్క్ మేళా ప్రారంభం





తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీబీఆర్ హాస్పిటల్ రోడ్డులోని డీపీఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన లేపాక్షి కాటన్ అండ్ సిల్క్ మేళాను గురువారం ఘనంగా ఆరంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరై లేపాక్షి కాటన్, సిల్క్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమల లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం మేనేజర్ బీపీ. వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రంలోనున్న వివిధ రకాల హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను గుర్తించి వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తూ తద్వారా హస్తకళలు, చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సంస్థ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ప్రదర్శనలు, విక్రయాలు ఏర్పాటు చేస్తూ చేనేత, హస్తకళలకు విస్తృత ప్రచారంతో వారి అభివృద్ధికి తోడ్పడుతున్నట్లు తెలిపారు. రానున్న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రస్తుతం డీపీఆర్ కన్వెన్షన్ హాల్లో లేపాక్షి కాటన్ అండ్ సిల్క్ మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రదర్శన జనవరి 12వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సెలవు దినాలలో కూడా ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తయారు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళా వస్తువులు లభిస్తాయని తెలిపారు. గద్వాల్ కాటన్, సిల్క్ వెంకటగిరి కాటన్, పోచంపల్లి కాటన్, నారాయణపేట, ఉప్పాడ, మంగళిరి, చీరాల, కలంకారి జందాని, లెనిన్ కాటన్ వంటి అనేక కాటన్ వస్త్రాలు, ప్రింటెడ్ చీరలు, టాప్స్, బెడ్షట్స్, డ్రెస్ మెటీరియల్స్, షర్టింగ్, డోర్ కర్టన్స్, హైదరాబాద్ మంచి ముత్యాలు, గాజులు ఆభరణాలు ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి



గంగవరం మేజర్ న్యూస్: గంగవరం మండలం మబ్బు వాళ్ల పేట గ్రామంలో దళితులపైన దాడి చేసిన అగ్రకుల పెత్తందారులు గోవర్ధన్ ,రాకేష్, దుర్గా వారి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ బృందం డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జాతీయ మానవ హక్కుల బృందం గురువారం గ్రామాన్ని సందర్శించి బాధితులతో జరిగిన సంఘటనపై వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డివి మునిరత్నం, వేలయుధం, పార్థసారథి, మనీ, సోము మాట్లాడుతూ 26వ తేదీన సంఘటన జరిగిన తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేస్తే అక్కడ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. న్యాయం కోసం బాధితులు రెండు రోజులు కార్యాలయం చుట్టూ తిరిగితే ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బాధాకరమన్నారు. ఓ ఫంక్షన్ కార్యక్రమం వద్ద బాధితుడు రవి నిల్చుకొని ఉండగా పై తెలిపిన బాధ్యులు గోవర్ధన్, రాకేష్, దుర్గ, వీరి అనుచరులు కొంతమంది కులం పేరుతో తిట్టి కొట్టి అవమానించడం, రవిని చంపేస్తారేమోనని కాపాడుకోవడానికి అదే వీధికి చెందిన దళిత మహిళలు వనిజ ,ఈశ్వరమ్మలపై విచక్షణ రహితంగా దాడి చేసి కొట్టడం దుర్మార్గమన్నారు. దళితులపై దాడి చేసినవారే దళితులపై కౌంటర్ కేసులు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తే దయచేసి పోలీసులు వారు వాటిని తిరస్కరించాలని కోరారు. పోలీసు అధికారులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# ఆల్ ఇండియా టాపర్లకు కౌటిల్యలో అభినందనలు




తిరుపతి, మేజర్ న్యూస్ : జాతీయస్థాయి పరీక్ష అయిన క్యాటు ఫలితాలలో ఆల్ ఇండియా టాపర్లుగా ర్యాంకులు సాధించిన కౌటిల్య విద్యార్థులకు గురువారం ఎంఆర్ పల్లి లోని కౌటిల్య ఇన్స్టిట్యూషన్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి కౌటిల్య ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గత 15 సంవత్సరగా క్యాట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఐఐఎం, బిజినెస్ స్కూల్స్ నిర్వహించే ఇంటర్వ్యూ రాత పరీక్షలు గ్రూప్ డిస్కషన్ కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దానిద్వారా క్యాట్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఐఐఎం లో నిర్వహించే ఇతర సెలెక్షన్ టెస్టులలో సులభంగా విజయం సాధించి ఎంబీఏ అడ్మిషన్స్ సాధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. క్యాట్ ఫలితాలలో తమ యూనివర్సిటీలో శిక్షణ పొందిన పదిమంది విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

# జనసేన నేత రాజారెడ్డి హౌస్ అరెస్ట్



తిరుపతి, మేజర్ న్యూస్ : టీటీడీలో పనిచేసే ఉద్యోగులకు పంపిణీ చేస్తున్న ఇంటి స్థలాల పట్టాలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటాన్ని ముద్రించడాన్ని జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్, నగర అధ్యక్షులు రాజారెడ్డిలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని పిలుపునివ్వడంతో గురువారం ఉదయం కిరణ్ రాయల్ రాజారెడ్డి ల నివాసాల వద్దకు పోలీసులు చేరుకొని వారిని హౌస్ అరెస్ట్ చేశారు. ఇప్పటికైనా టిటిడి పాలకమండలి సభ్యులు ఇంటి స్థలాల పట్టాలలో జగన్మోహన్ రెడ్డి ఫోటోను తీయకపోతే ఒకటి రెండు రోజులలో తిరుపతిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని రాజారెడ్డి హెచ్చరించారు.

# ఆప్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి..

తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్ : ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట చలపతి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి ఆర్.మనీ నాయుడు ఆదేశాల మేరకే సామాన్యుడి శంఖారావం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారంనియోజకవర్గ కన్వీనర్ బొంతల రాజేష్ రాయల్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని ఆటోనగర్, కాటన్ మిల్ ప్రాంతంలో పార్టీ విధివిధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకట చలపతి, రాష్ట్ర కమిటీ సభ్యులు మహేష్ బాబు, జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్ పార్టీ కలపత్రాలను ప్రతి ఇంటికి పంచి సిద్ధాంతాలను వివరిస్తూ మహిళలను ఆటో కార్మికులను ప్రజలను పార్టీలోకి ఆహ్వానించారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో ఆదర్శ పాలన అందిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ వ్యవస్థాపక కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రేరణతో రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులకు ప్రజలందరూ మద్దతు నిలిచి వారికి కృషి చేయాలని కోరారు. సామాన్యుడికి సంక్షేమ పథకాలు చేరువుగా చేయాలని మొట్టమొదటిగా ఢిల్లీ పంజాబ్ రాష్ట్రాలలో లబ్ధిదారులకు అందిస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్లో ఆమ్ ఆద్మీ పార్టీ విస్తరిస్తుందని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మనోజ్, అహ్మద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సుభాష్ వర్మ, వంశీ పాల్గొన్నారు.







# టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలి..

**- తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వం..**

**- అలిపిరి గరుడ సర్కిల్ లో టిడిపి శ్రేణుల నిరసన - పలువురు అరెస్ట్**

**తిరుపతి, మేజర్ న్యూస్ :**

తిరుమల తిరుపతి దేవస్థానములలో పనిచేసే ఉద్యోగులకు పంపిణీ చేసే ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటో ముద్రించడాన్ని నిరసిస్తూ తిరుపతిలో తెలుగుదేశం పార్టీ నాయకులునిరసన చేశారు. గురువారం అలిపిరి గరుడ సర్కిల్లో నిరసన తెలుపుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలను అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టిటిడి ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ లో జగన్ రెడ్డి ఫోటోను వెంటనే తొలగించాలని, టీటీడీ చైర్మన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శ్రీవారి భక్తుల విశ్వాసాలను మొదటినుంచి దెబ్బతీస్తున్న జగన్ రెడ్డి ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల ఆరాధ్య దైవమైన తిరుమల శ్రీవారి పవిత్రతను దెబ్బతిస్తున్నారని పేర్కొన్నారు. టిటిడి ఉద్యోగులకు పంపిణీ చేసి ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ లో సీఎం ఫోటో ప్రచురించడం ఫోటోలు పిచ్చికి పరాకాష్ట అని ఆరోపించారు. గతంలో టీటీడీ ఉద్యోగులకు హౌసింగ్ అలాట్మెంట్స్ ఇంటి పట్టాల పంపిణీలో ముఖ్యమంత్రుల ఫోటోలు ప్రచురించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందాలని దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.టీటీడీ ధార్మిక సంస్థలు రాజకీయ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలు గుర్తులు రాజకీయ నాయకులు ఫోటోలు ముద్రించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి దుశ్చర్యలు హేయమైనవిని పేర్కొన్నారు. అనంతరం తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనిమిని రవి నాయుడు మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వ తీరు పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, టిటిడి ఉద్యోగుల ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ లో ముఖ్యమంత్రి ఫోటో ప్రచురించడానికి తాము తీవ్రంగా వ్యతిరేస్తిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి శ్రీవారి భక్తులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ లో జగన్ రెడ్డి ఫోటో లేకుండా ముద్రించాలని కోరారు. అంగన్వాడీ పిల్లలకు పంపిణీ చేసే కోడిగుడ్ల నుంచి రైతులకు అందించే పాస్ పుస్తకాల వరకు జగన్ ఫోటోలు ప్రచురించటం పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. . టీటీడీ ఉద్యోగులకు అందజేసే ఇంటి స్థలాల ప్రొసీడింగ్ స్పై జగన్ రెడ్డి బొమ్మతో కూడిన నవరత్నాల లోగోను తక్షణమే తొలగించాలన్నారు. సొంత నగదుతో స్థలాన్ని కొనుక్కుంటున్న టీటీడీ ఉద్యోగులకు ఇచ్చే ప్రొసీడింగ్స్ పై నేతల బొమ్మలు ప్రచురించడమేంటి? అని ప్రశ్నించారు.

ఎ ఇప్పటికే పథకం ప్రకారం టీటీడీ పవిత్రతను దెబ్బతీస్తున్నారు. తిరుమల శ్రీవారిని నల్లరాయి అన్న భూమన కరుణాకర్ రెడ్డికి టీటీడీ చైర్మన్ పదవి కట్టబెట్టారని పేర్కొన్నారు. అన్యమతస్థుడైన జగన్ రెడ్డి.. ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల పర్యటించడం, స్వామి వారికి తాను ఒక్కడే పట్టువస్త్రాలు సమర్పించడంపై పండితులు, మేధావులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా జగన్ రెడ్డి ఖాతరు చేయడం లేదని చెప్పారు.

అనంతరం జగన్ రెడ్డి ప్రభుత్వానికి, భూముల కరుణాకర రెడ్డికి వ్యతిరేకంగా నిరసనలు, ప్లకార్డులను ప్రదర్శించారు. నిరసన చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను అరెస్టు చేశారు సాయంత్రం తిరిగి వదిలిపెట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు, టిడిపి నగర్ అధ్యక్ష కార్యదర్శులు వట్టికుంట చినబాబు, నైనార్ మహేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, టిడిపి తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం, కరాటే చంద్ర హేమంత్ రాయల్ మేడుకుర్తి విశ్వనాథం పాల్గొన్నారు.

# కాణిపాకం ఆలయంలో నూతన సంవత్సరం ప్రతి భక్తునికి దర్శనం

**- ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ. మోహన్ రెడ్డి, ఎఈఓ రవీంద్రబాబు**

ఐరాల(,మేజర్ న్యూస్) కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి సందర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రతి భక్తునికి దర్శనం భాగ్యం కల్పిస్తుంట్లు ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ. మోహన్ రెడ్డి, ఎఈఓ రవీంద్ర బాబులు ఆలయ ట్రస్టుబోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకొన్నట్లు వారు తెలిపారు. గురువారం ఆలయ ట్రస్టుబోర్డు సమావేశం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ. మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈమేరకు 2024 జనవరి 1 వతేది న మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక, కేరళ,మహారాష్ట్ర,తెలంగాణా వంటి పొరుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా తగు చర్యలు తీసుకునేందుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. 2023 నవంబరు నెల ఆదాయం , వేయములు గురించి చర్చించినట్లు వారు స్పష్టంచేశారు. అలాగే త్వరలో నే పలు అభివృద్ధికార్యక్రమాలను శంఖుస్థాపన లు,ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు వారు వివరిం చారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు ఎక్స్ అఫిషియో యన్.సోమ శేఖర్ నరసింహులు శెట్టి, గోవర్ధన్,రవీంద్రుడు,కాంతమ్మ, శుభలక్ష్మమ్మ, జయశ్రీ, వెంకట రమణమ్మ, రామసుబ్బమ్మ,ప్రతిమ, ఈ ఈ వెంకట నారాయణ, ఎఈఓ లు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ,సూపర్ డెంట్లు కోదండపాణి, వాసు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. శ్రీ స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయం నందు ఈరోజు దేవస్థానం చైర్మన్ శ్రీ మోహన్ రెడ్డి గారు, ఆధ్వర్యంలో పాలకమండలి సమావేశం



నిర్వహించడం జరిగింది, ఈ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరిగింది, నూతన సంవత్సరం ఏర్పాట్లు మరియు జనవరి 1వ తేదీన వచ్చు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా దర్శన చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు, త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేయనున్నారు తెలిపారు, నవంబర్ నెల ఆదాయ వెయ్యములు గురించి చర్చించారు, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నరసింహులు శెట్టి, గోవర్ధన్, రవీంద్రుడు, కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ, జయశ్రీ, వెంకటరమణమ్మ, రామసుబ్బమ్మ, ప్రతిమ, ఎక్స్అఫ్సియో సభ్యులు సోమశేఖర్ గురుకుల్, ఈ.ఈ వెంకట నారాయణ, ఏఈఓ లు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ, సూపరిడెంట్లు కోదండపాణి, వాసు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమం విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు..

- ఉద్యోగులతో విడదీయరాని బంధం - టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి
- ఈ ప్రభుత్వం వల్లే ఉద్యోగుల కల సాకారమైంది : టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి
- ముఖ్యమంత్రి కి , టీటీడీ చైర్మన్ కు రుణపడి ఉంటాం : టీటీడీ ఉద్యోగులు
- మహతిలో వేడుకగా టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ పండుగ



**తిరుపతి, మేజర్ న్యూస్ బ్యూరో :** ఉద్యోగుల సంక్షేమం, ధార్మిక ప్రచారంలో వెనుకడుగు వేసేది లేదని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఎన్ని విమర్శలు ఎదురైనా కార్మికులకు, ఉద్యోగులకు మేలు చేయడంలో వెనక్కు తగ్గే ప్రసక్తి లేదని ఆయన చెప్పారు. టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ పండుగ కార్యక్రమం గురువారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ వేలాదిమంది ఉద్యోగులకు తన చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. తన జీవితంలో ఇది మహదానందం కలిగించిన రోజని ఆయన చెప్పారు. 17 సంవత్సరాల క్రితం తాను టీటీడీ చైర్మన్ గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిని కలిసి ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయమై చర్చించినట్లు చెప్పారు. తన ఒత్తిడి వల్లే ఉద్యోగులకు ఇంటిస్థలాలు మంజూరు చేసినట్టు 2009లో శ్రీ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇదే వేదిక మీద తెలియజేశారని ఆయన గుర్తు చేశారు. తాను ఆరో తరగతి నుంచి డిగ్రీ దాకా టీటీడీ విద్యాసంస్థల్లోనే చదివానని ఆయన చెప్పారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తన ద్వారా సాధించే రోజు రావాలనే కోరిక దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో సాకారమైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇప్పించే విషయం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాను సంప్రదించినప్పుడు ఆయన ఉద్యోగులందరికీ ఉచితంగా ఇంటి స్థలాలు ఇద్దామని చెప్పారన్నారు. అయితే చట్ట ప్రకారం ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ కూడా ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమాన్ని సాకారం చేయడంలో ఈఓ ధర్మ రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర కార్యనిర్వాహకవర్గం తనకు చేదోడు వాదోడుగా ఉండి ముందుకు నడిపించారని చైర్మన్ అభినందించారు.

పాగాలి వద్ద 350 ఎకరాల భూమి టీటీడీకి ఇవ్వడంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి కృషి కూడా అభినందనీయమన్నారు. ఇందుకోసం బుధవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో 87 కోట్ల రూపాయలు మంజూరు చేయించడంలో ఈవో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఉద్యోగులతో తమకున్న బంధాన్ని విడదీయలేరని కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. తాను పేరు కోసం కాకుండా బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించానన్నారు. తాను రాజకీయాల్లో ఉండడం వల్లే ఎమ్మెల్యేగా, చైర్మన్ గా అయ్యానని, ఈ పదవులు రావడం వల్లే పేదల కోసం, ఉద్యోగుల కోసం తాను నిస్వార్ధంగా పనిచేయగలుగుతున్నానని ఆయన చెప్పారు. ఎన్నో ప్రభుత్వాలు ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయం గురించి చూస్తాం, చేస్తామని చెప్పారు కానీ చేసింది మాత్రం వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వల్లే టీటీడీలో పారిశుధ్య కార్మికులకు రూ.5000, పోటు కార్మికులకు పది వేల రూపాయల జీతం పెంచగలిగామని చెప్పారు. అలాగే వాహనం బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్ గా గుర్తించి వారికి కూడా జీతాలు పెంచగలిగే ఏర్పాటు చేయగలిగామన్నారు. ఉద్యోగులు తనను శాసనసభ్యుడుగా కాకుండా మీలో ఒకటిగా చూపిస్తున్న ప్రేమను కలకాలం గుండెల్లో దాచుకుంటానని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం కోసం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సేవను గుర్తించుకోవాలన్నారు. పాలకమండలి నుంచి కిందిస్థాయి ఉద్యోగులందరూ కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి దయతోనే ఇక్కడ ఉన్నామనే విషయాన్ని గుర్తించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈవో ఏవి ధర్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు మంజూరు చేసేలా ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కోసం 210 కోట్ల రూపాయలు ఉద్యోగుల తరపున చెల్లించడం చారిత్రాత్మకమని ఆయన చెప్పారు. పాగాలి వద్ద 350 ఎకరాలు త్వరలోనే స్వాధీనం చేసుకుని జనవరి చివరి నాటికి టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ ఇంటి స్థలం ఇప్పించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు కరుణాకర రెడ్డి సహృదయంతో టీటీడీ ఉద్యోగులకు ఎంతో లబ్ధి కలిగిందని ఆయన అన్నారు. వడమాలపేట దగ్గర ప్రస్తుతం ఉద్యోగులకు ఇస్తున్న ఇంటి స్థలం మార్కెట్ విలువ 40 లక్షల రూపాయలకు చేరుకుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం, ధర్మకర్తల మండలి ద్వారా ఎంత మేలు జరిగిందో ఉద్యోగులు గుర్తించాలన్నారు.

హెచ్.బి.ఎల్ వారికి కూడా ఇంటి స్థలాలు ఇస్తామని, రెండో విడతగా మరో 15 రోజుల్లో ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమం మహతి ఆడిటోరియంలోనే నిర్వహిస్తామని చెప్పారు. ఉద్యోగులు భక్తుల సేవే ముఖ్యంగా పనిచేయాలన్నారు. భక్తులు హుండీ ద్వారా స్వామివారికి సమర్పిస్తున్న కానుకల వల్లే తమ కుటుంబాలు జీవిస్తున్నాయన్న విషయం గుర్తించి స్వామి సేవలో, ఉద్యోగుల సేవలో అంకితం కావాలని పిలుపునిచ్చారు. వైకుంఠ ద్వార దర్శనం 10 రోజుల్లో ఎప్పుడు చేసుకున్నా ఒకటే ఫలితం లభిస్తుందనే విషయం ఉద్యోగులు గుర్తించి వైకుంఠ ఏకాదశి, ద్వాదశి నాడు భక్తుల కోసం సేవ చేసి, మూడవ రోజు నుంచి పదవరోజు దాకా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ విధానం కొనసాగించేలా కృషి చేయాలని ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమం కోసం టీటీడీ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే 800 అప్పీళ్లను కొత్త బోర్డు వచ్చాక పరిష్కరించామని, భవిష్యత్తులో డిఏ కేసులు లేకుండా ఉండేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. అనంతరం సీనియర్ అధికారుల సంఘం తరపున టీటీడీ పీఆర్వో డా. టి.రవి, పలువురు ఉద్యోగులు ప్రసంగించారు. ఆ తరువాత టీటీడీ చైర్మన్, ఈవో చేతుల మీదుగా ఉద్యోగులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ప్రతినిధులతో కేంద్ర మంత్రి ముఖాముఖి

తిరుపతి కార్పొరేషన్ మేజర్ న్యూస్ : సిమ్స్ లోని పద్మావతి ఆడిటోరియంలో గురువారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బాగల్ ఆరోగ్యశ్రీ ఎంప్యానల్ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ అభియాన్ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ఆయుష్మాన్ భారత్ అభియాన్ అనేది భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని, దీనిని 23 సెప్టెంబర్ 2018న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. భారతదేశంలోని అన్ని స్థాయిలలో ఆరోగ్య సమస్యలను పరిష్కరించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమన్ని ప్రారంభించబడిందన్నారు. దేశంలోని ప్రాథమిక, ద్వితీయ, తృతీయ ఆరోగ్య సంరక్షణ అవసరాలకు ఇది బాగా సమీకృత విధానం. సగటు వృద్ధి రేటు పెరుగుతున్న జనాభాతో7.2%, ఆరోగ్య సంరక్షణ అవసరం అవుతుందిఅని, ఈ కార్యక్రమం 'ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన 'హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ అనే రెండు కొత్త పథకాలను తీసుకువచ్చిందిని తెలియచేశారు. నేషనల్ హెల్త్ అథారిటీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ రోహిత్ డియో ఝా మాట్లాడుతు రాష్ట్రం నలుమూలల నుంచి 100 మంది వైద్యులు 50 నెట్వర్క్ హాస్పిటల్స్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి పాల్గొన్నారని తెలియచేశారు. ఆయుష్మాన్ భారత్, డాక్టర్ వై ఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కీం అని రాష్ట్ర ప్రజలందరూ నగదు రహిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీకే బాలాజీ మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్‌లోని అర్హులైన వారందరికీ సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ యాక్సెస్‌ను అందించడం ఈ పథకం లక్ష్యం. ఇది వ్యక్తులు కుటుంబాలు, వారి సామాజిక-ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా, నాణ్యమైన వైద్య సంరక్షణను పొందగలదని నిర్ధారిస్తుంది



డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ విస్తృతమైన వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు, రోగనిర్ధారణ పరీక్షలు ఆరోగ్య సంరక్షణ సేవలకు సమగ్ర కవరేజీని అందిస్తోంది. లబ్ధిదారులు ఎంప్యానెల్డ్ నెట్‌వర్క్ ఆసుపత్రులలో నగదు రహిత ఆరోగ్య సంరక్షణ సేవలను పొందవచ్చు . దీని అర్థం వారు కవర్ చేయబడిన వైద్య చికిత్సల కోసం ముందస్తు చెల్లింపులు చేయనవసరం లేదుని తెలియచేశారు.స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్. ఆర్.వి.కుమార్ మాట్లాడాతు పేదలకు నిరుపేదలకు అం దుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణను అందించాలనే ఉద్దేశ్యంతో, ఆయుష్మాన్ భారత్ యోజన పథకం సెకండరీ తృతీయ ఆసుపత్రి సం రక్షణ కోసం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.5 లక్షల వరకు కవరేజీని అందిస్తుందిని తెలియచేసారు.ఈ కార్యక్రమం ఆరోగ్యశ్రీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిహెచ్ వెంకట దీపక్, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్. సిపాయి సుబ్రహ్మణ్యం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. శ్రీహరి, స్విమ్స్ వైద్యులు, డాక్టర్. శ్రీనాథ్ రెడ్డి, బయో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జయచంద్ర రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా సమాన్వయ కర్తలు, జిల్లా మానేజేర్, టీం లీడర్స్, పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలు రద్దు

**- ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ. మోహన్ రెడ్డి,ఆలయ ఈవో వెంకటేశు**

ఐరాల,(మేజర్ న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా శ్రీ యుత కమిషనర్ 2017 ఉత్తర్వులు మేరకు 2024 జనవరి 1వ తేది సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరం సంధర్భంగా కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి ఆలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు, నూతన సంవత్సరం వేడుకలు ను రద్దు చేశామని ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ. మోహన్ రెడ్డి, ఆలయ ఈవో ఎ. వెంకటేశు లు తెలిపారు. అదే వేడుకలను హిందూ సంప్రదాయ ప్రకారం తెలుగు నూతన సంవత్సరం ఉగాది రోజున తెలుగు నూతన సంవత్సరం, శుభాకాంక్షలు, వేడుకలు నిర్వవహించేందుకు ఏర్పట్లు సిద్ధం చేస్తునట్లు వారు పేర్కొన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మ దయశాఖ కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1 వతేదిన భారత వైదిక విధానంకాదని,అంతేకాకుండా ఈ ఆంగ్లేయా సంప్రదాయం ఆలయాలకు కూడా విస్తరించి భక్తులకు శుభాకాంక్షలు తెల్పకోవడం హిందూ సంప్రదాయం కాదని హిందు ధర్మ పరిరక్షణ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. భారతీయ సంప్రదాయాలకు పట్టం కడుతూ భక్తులకు హిందూ ధర్మాన్ని మన రాష్ట్రానికే కాకుండా దేశానికి సాటి చెప్పుట కొరకు తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ రోజు నా తెలుగు నూతన సంవత్సరం శుభాకంక్షాలు తెలుపుకోవడం అనువాయితిగా మారిందన్నారు. అయితే 2024 జనవరి 1 వతేది స్వామి వారి సందర్శనార్థం మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక,కేరళ,మహారాష్ట్ర,తెలంగాణా వంటి పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా మౌలిక వసతులు కల్పిస్తుంట్లు వారు వివరించారు. భక్తులు సౌకర్యార్థం వాహనాలు పార్కింగ్ చేయుటకు ఉచిత డార్మిటరీ ఎదురుగా ఉన్నకాళి స్థలంలో దివ్య చక్ర వాహనం లు, కార్లు,జీపులు,బస్సులు వాహనాలు పార్కింగ్ చేసి దేవస్థానికి సహకరించాలని వారు కోరారు. 2024 నూతన సంవత్సరం సందర్భంగా స్వామి వారి సందర్శనార్థం భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున దేవస్థానం నందు భక్తులకు వివిధ ప్రదేశాలలో కోవిడ్ ఫొటోకల్ నిబంధనలు పాటిస్తూ ఉచిత ప్రసాదం పంపిణీ చేయడానికి ఆసక్తి గల ధాతలు కాణిపాకం దేవస్థానం కార్యనివర్వహన అధికారి వారి కార్యాలయం నందు 2023 డిసెంబరు 30 వతేది ఉదయం 9 గంటలకు సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# చంద్రన్న రాకతో పసుపుమయమైన గుడుపల్లి

# కుప్పం

